



DD9 వార్త
తెలుగు దినపత్రిక

## అకాల వర్షం.. అన్నదాతకు తీరని శోకం



07

సంపుటి : 02 సంచిక : 225 హైదరాబాద్, ఏప్రిల్, ఆదివారం 05, 2026 పేజీలు : 06 వెల : 3.00



# మూడింతలు.. ముప్పుతిప్పలు

**అప్‌డేట్ కాని బయోమెట్రిక్‌తో కష్టాలు**
**మొరాయిస్తున్న ఈ–పోస్ సాఫ్ట్‌వేర్**
**బారులు తీరుతున్న కార్డుదారులు**
**ప్రహసనంగా మూడు నెలల రేషన్**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
ఒకేసారి మూడు నెలల ( ఏప్రిల్, మే, జూన్) ఉచిత రేషన్ బియ్యం పంపిణీ ప్రక్రియ ప్రహసనంగా మారింది. ఈ- పోస్ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ కాకపోవడంతో కాలయాపన జరుగుతోంది. గతంలో కరోనా సంక్షోభ సమయంలో ఇదే తరహాలో మూడు నెలల బియ్యం పంపిణీ చేసినప్పుడు ప్రభుత్వం సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసి ఒకే బయోమెట్రిక్ అథెంటికేషన్‌తో పంపిణీని సులభతరం చేసింది. ప్రస్తుతం పంపిణీలో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ కాకపోవడంతో పాత పద్ధతినే అనుసరిస్తున్నారు. ప్రతి కార్డుదారు మూడు విడతల బియ్యం కోసం ఈ-పోస్ యంత్రంపై మూడుసార్లు వేలిముద్ర వేయాల్సి వస్తోంది. వేయింగ్ మిషన్‌పైనా మూడుసార్లు తూకం వేయడం

...మిగతా 2లో



# రూ.225 కోట్లతో 'బాసర' మాస్టర్ ప్లాన్ రెడీ..

**రూ.225 కోట్ల వ్యయంతో ఆలయ అభివృద్ధి**
**ఆధ్యాత్మికత ఉట్టిపడేలా నిర్మాణాలు**
**6న బాసర ఆలయ అభివృద్ధి పనులకు సిఎం శంకుస్థాపన**
**అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షించిన రేవంత్ రెడ్డి**
**భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఆలయాన్ని అభివృద్ధి చేయాలని సీఎం ఆదేశాలు**
**ఆలయ పరిసరాల్లో ఈవీ వాహనాలను మాత్రమే అనుమతించాలని సూచన**
**ఆలయ ప్రాంతంలో రాజకీయ కార్యకలాపాలకు నిషేధం**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
బాసర ఆలయ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది. సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 6న బాసర సరస్వతి ఆలయం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. సుమారు రూ.225 కోట్ల వ్యయంతో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. బాసర ఆలయ అభివృద్ధికి సంబంధించి సమగ్ర మాస్టర్ ప్లాన్ ఇప్పటికే సిద్ధం కాగా, ఆలయాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని సీఎం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాలమైన రహదారులు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఆలయ పరిసరాల్లో పర్యావరణ పరిరక్షణ

...మిగతా 2లో

## బీఆర్ఎస్‌లో కలవరమవుతున్న కవిత మాటలు

**కొత్త పార్టీపై కవిత సంచలన వ్యాఖ్యలు**
**'టీఆర్ఎస్' పేరుపై మళ్లీ చర్చ**
**బీఆర్ఎస్‌లో కలకలం రేపిన ప్రకటన**
**రాజకీయ వ్యూహంపై విశ్లేషకుల చర్చ**



02

# "ఇందిరమ్మ రాజ్యం" పేరుతో గూండా రాజ్యమా?

**కెసిఆర్ క్యాంప్ కార్యాలయంపై దాడి దుర్మార్గం**
**సీఎం, మంత్రులు రాష్ట్ర పాలనను పట్టించుకోవడం లేదని ఆరోపణ**
**పోలీసు వ్యవస్థ అధికార పార్టీకి అనుకూలంగా పనిచేస్తోందా?**
**బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కార్యాలయాలపై దాడులకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చారా?**
**దాడి చేసిన వారిని వెంటనే గుర్తించి అరెస్ట్ చేయాలని డీజీపీకి విజ్ఞప్తి**
**కేసీఆర్ క్యాంపు కార్యాలయంపై దాడి..**
**సీఎం రేవంత్‌పై హరీశ్ రావు ఫైర్**



02

## తప్పు నిరూపిస్తే రాజకీయాలు వదిలేస్తా

**నేను అసెంబ్లీ నక్సలైట్‌గా మారుతా**
**డంపింగ్ యార్డ్‌పై తీవ్ర వ్యతిరేకత**
**కేసులు, విచారణలపై ప్రభుత్వాన్ని టార్గెట్**
**ప్రజా పోరాటానికి 'అసెంబ్లీ నక్సలైట్' హెచ్చరిక**
**కౌశిక్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం, ముఖ్యంగా తన నియోజకవర్గ ప్రజల ప్రయోజనాల కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని ప్రకటిస్తూ, అవసరమైతే తాను 'అసెంబ్లీ నక్సలైట్'గా మారుతానని, అందుకు వెనుకాడబోనని స్పష్టం చేశారు. తన నియోజకవర్గంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. హుజూరాబాద్ ప్రజలు ఏం పాపం చేశారని అక్కడ డంపింగ్ యార్డ్ పెడుతున్నారని ప్రశ్నించిన ఆయన, ఇది కరోనా కంటే అత్యంత

...మిగతా 2లో

## 48 గంటల తర్వాత విధ్వంసమే..

**హోర్ముజ్ తెరవకుంటే దాడులు చేస్తాం..**
**20 రెట్లు ఎక్కువ బలంతో ప్రతిదాడి**
**అవసరమైతే ఇరాన్ పవర్ ప్లాంట్లపై దాడులు**
**"ఇక ఆలస్యం కాకముందే ఒప్పందానికి రండి"**
**ఇరాన్‌కు వార్నింగ్ ఇచ్చిన ట్రంప్..**



02

# నిరీక్షణకు తెర

**ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ బీఆర్ఎస్ కైవసం**
**వ్యూహాలు పన్ని చేతులు కాల్చుకున్న కాంగ్రెస్**
**ఎన్నిక మధ్యలోనే వెళ్లిపోయిన హస్తం నేతలు**
**చైర్మన్‌గా గులాబీ నేత.. వైస్ చైర్మన్‌గా బీజేపీ నేత**
**క్యాతనపల్లి కూడా బీఆర్ఎస్ వశం.. ఖానాపూర్‌లో వాయిదా**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
దాదాపు రెండు నెలల క్రితం మున్సిపాలిటీ ఎన్నికల్లో మేజర్ స్థానాలు అధికార కాంగ్రెస్ కైవసం చేసుకున్నది. ఎక్కడైతే తక్కువ స్థానాలు ఉన్నాయో కో ఆప్షన్ మెంబెర్స్ సహాయంతో చైర్మన్ పీఠం దక్కించుకున్నది. ఇదే పద్ధతిలో ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ చైర్మన్ పీఠం దక్కించుకునేందుకు కాంగ్రెస్ విశ్వ ప్రయత్నాలు చేసింది. కానీ, ఏవీ ఫలించలేదు. తొలుత వాయిదా పడి ఎన్నికల కమిషన్ ఆదేశాలతో

...మిగతా 2లో

# అబద్ధాలు చెప్పడమే లెఫ్ట్, కాంగ్రెస్ పని..

**కాంగ్రెస్ సహా విపక్షాలు అబద్ధపు ప్రచారం చేస్తున్నాయని వ్యాఖ్య**
**సినిమాలు, జాతీయ అంశాలపై తప్పుదోవ పట్టిస్తున్నారు**
**అబద్ధాలు చెప్పడం వారి కాంగ్రెస్ నైజం**
**పశ్చిమాసియా అంశంపై భయాన్ని సృష్టిస్తున్నారు**
**కేరళలో ఎల్‌డీఎఫ్ ప్రభుత్వంపై కీలక వ్యాఖ్యలు**
**ఈశాన్య రాష్ట్రాల తరహాలో అభివృద్ధి ప్రాజెక్టులు చేపడతామని హామీ**
**కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు అబద్ధాల ఫ్యాక్టరీలు..**
**కేరళ స్టోరీ, ధురంధర్‌పై కూడా అబద్ధాలు ప్రచారం..**
**కేరళ ఎన్నికల ర్యాలీలో ప్రధాని తీవ్ర విమర్శలు..**



**నేషనల్‌బ్యూరో, (డిడి9 వార్త):**
ప్రధాని నరేంద్రమోడీ కేరళ ఎన్నికల ప్రచారంలో లెఫ్ట్ పార్టీలు, కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. కేరళ స్టోరీ నుంచి ధురంధర వరకు ప్రతీ సినిమా అబద్ధమని చెబుతున్న ఈ పార్టీలే అబద్ధాలు చెప్పడంలో నిపుణులయ్యారని ఆయన అన్నారు. కేరళలోని తిరువల్లాలో జరిగిన ర్యాలీలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఎల్డీఎఫ్, యూడీఎఫ్ కూటములు అబద్ధాలు చెప్పడంలో

...మిగతా 2లో

## తప్పు నిరూపిస్తే రాజకీయాలు వదిలేస్తా

**మొదటిపేజీ తరువాయి**

ప్రమాదకరంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తనపై ఉన్న వ్యక్తిగత కోపంతో ప్రజలను ఇబ్బంది పెట్టవద్దని, కావాలంటే తనను మెట్రో పిల్లర్‌కు ఉరి వేయాలని భావోద్వేగంగా వ్యాఖ్యానించారు.



ప్రభుత్వం తనపై పెడుతున్న కేసులు , విచారణల పేరుతో కాలయాపన చేస్తోందని కౌశిక్ రెడ్డి విమర్శించారు. వచ్చే రెండేళ్ల పాటు తనను కేసులతో ఇబ్బంది పెట్టవచ్చని, కానీ రెండేళ్ల తర్వాత కేసీఆర్ మళ్ళీ ముఖ్యమంత్రి అవుతారని, అప్పుడు ఇప్పుడు తనను వేధిస్తున్న కేసులే పోలీసుల మెడకు చుట్టుకుంటాయని హెచ్చరించారు. తన సొంత ఊరిలో దేవుడికి మొక్కుకోవడానికి వెళ్తున్న తనను అడ్డుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, తాను ఏదైనా తప్పు చేసినట్లు నిరూపిస్తే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. ప్రజా పోరాటంలో భాగంగా అసెంబ్లీ వేదికగా గొంతు వినిపిస్తానని, అందుకు 'అసెంబ్లీ నక్సలైట్'గా మారడానికైనా సిద్ధమని ఆయన పునరుద్ఘాటించారు.

## అబద్ధాలు చెప్పడమే లెఫ్ట్, కాంగ్రెస్ పని..

**మొదటిపేజీ తరువాయి**

నిపుణులయ్యాయని విమర్శించారు. లెఫ్ట్, కాంగ్రెస్ పార్టీలు అబద్ధాల ఫ్యాక్టరీలుగా మారాయని అన్నారు. విదేశీ విరాళాల (నియంత్రణ) చట్టం (FCRA), యూనిఫాం సివిల్ కోడ్ (UCC)లకు ఇటీవల చేసిన సవరణలపై అనవసర భయాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు.



దేశంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం ద్వారా ఇరాన్, గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న కోటి మంది భారతీయ వలసదారుల ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతున్నారని ఆగ్రహించారు. ఎన్నికల ప్రయోజనం కోసం ఈ వలసదారుల భద్రతను కాంగ్రెస్ ప్రమాదంలోకి నెడుతోందని విమర్శించారు. ఇలాంటి బాధ్యతారాహిత్యమైన మాటల ద్వారా గల్ఫ్ దేశాలో భారత్‌కు ఉన్న బంధాన్ని దెబ్బతీయాలని చూస్తున్నారని అన్నారు. పశ్చిమాసియా దేశాలు భారత్‌ను శత్రువుగా చూడాలని చూస్తున్నారని కాంగ్రెస్‌పై ఆరోపణలు గుప్పించారు.

ఇరాన్‌లో పనిచేస్తున్న తమిళనాడు, గోవా, కేరళ, తెలంగాణ, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన భారతీయ మత్స్యకారులు ప్రస్తుతం ప్రమాదంలో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. వారిని రక్షించే పనిలో ప్రభుత్వం చురుకుగా నిమగ్నమై ఉందని, ఇప్పటికే వందలాది మంది సురక్షితంగా భారతదేశానికి తిరిగి వచ్చారని ఆయన తెలిపారు. గల్ఫ్, ఇరాన్‌లో ఉంటున్న భారతీయుల భద్రతకు ప్రధాని మోడీ హామీ ఇచ్చారు.

శబరిమల ఆలయం నుంచి బంగారం అదృశ్యం కావడంపై మోడీ మాట్లాడుతూ.. పుణ్యక్షేత్రం ప్రతిష్టను దెబ్బతీయడానికి ఎల్డీఎఫ్, యూడీఎఫ్‌లు కుమ్మక్కయ్యాయని ఆరోపించారు. ఈ రెండు పార్టీలు నాణేనికి రెండు వైపులు అని అన్నారు. కేరళలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ రెండు పార్టీలు జవాబుదారీగా ఉండాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

## బీఆర్ఎస్‌లో కలవరమవుతున్న కవిత మాటలు

- **కొత్త పార్టీపై కవిత సంచలన వ్యాఖ్యలు**
- **'టీఆర్ఎస్' పేరుపై మళ్లీ చర్చ**
- **బీఆర్ఎస్‌లో కలకలం రేపిన ప్రకటన**
- **రాజకీయ వ్యూహంపై విశ్లేషకుల చర్చ**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ రాజకీయ ముఖచిత్రం మరో కీలక మలుపు తిరగబోతోంది. బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చిన కల్వకుంట్ల కవిత సొంతంగా కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుకు ముహూర్తం ఖరారు చేశారు. అయితే, ఆమె పెట్టబోయే పార్టీ పేరుపై ఇన్నాళ్లూ సాగిన ఉత్కంఠకు తెర దించుతూ కవిత చేసిన తాజా వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో, ముఖ్యంగా బీఆర్ఎస్ వర్గాల్లో పెను సంచలనం సృష్టిస్తున్నాయి.

కొత్త పార్టీ పేరు గురించి మొదటిసారి నోరు విప్పిన కవిత, తన పార్టీ "పాత పేరు.. కొత్త ఎజెండా"తో ఉంటుందని స్పష్టం చేశారు. ఈ క్రమంలో ఆమె మాట్లాడుతూ.. తమ పార్టీ పేరు 'టీఆర్ఎస్' (TRS) కూడా కావచ్చేమోనని వ్యాఖ్యానించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. 2001లో ప్రారంభమైన టీఆర్ఎస్ పేరుతోనే తెలంగాణ ఉద్యమం నడిచిందని, ఆ పేరుపై ప్రజల్లో ఉన్న సెంటిమెంట్‌ను మళ్లీ తనవైపు తిప్పుకోవాలని కవిత వ్యూహరచన చేస్తున్నట్లు తెలుస్తోంది.

గతంలో టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చినప్పుడు ఆ పాత పేరు (టీఆర్ఎస్) ఎన్నికల కమిషన్ వద్ద ఫ్రీజ్ అయింది. అయితే, దీనిపై కవిత తనదైన విశ్లేషణ ఇచ్చారు. సాధారణంగా ఏదైనా పార్టీ పేరు రెండు సంవత్సరాల పాటు మాత్రమే ఫ్రీజ్ అయి ఉంటుందని, ఆ తర్వాత ఆ పేరును ఇతరులు దక్కించుకునే అవకాశం ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ఇందుకోసం తమ పార్టీకి సంబంధించి ఒక ప్రత్యేక బృందం పనిచేస్తోందని కూడా ఆమె వెల్లడించారు.

కవిత చేసిన ఈ వ్యాఖ్యలను బీఆర్ఎస్ నాయకత్వం తీవ్రంగా ఖండిస్తోంది. ప్రస్తుత ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం టీఆర్ఎస్ పేరును వేరే ఎవరికీ కేటాయించే అవకాశం లేదని వారు వాదిస్తున్నారు. తాము కావాలని కోరుకున్నా సరే ఆ పేరు మళ్లీ వచ్చే పరిస్థితి లేదని, అలాంటిది మరొకరు ఆ పేరును ఎలా తీసుకుంటారని వారు ప్రశ్నిస్తున్నారు. కవిత కేవలం గందరగోళం సృష్టించడానికే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని కొట్టిపారేస్తున్నారు.

రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం.. టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్‌గా మార్చిన తర్వాతే ఆ పార్టీ గ్రాఫ్ పడిపోవడం ప్రారంభమైంది. తెలంగాణ అనే గుర్తింపు పేరులో లేకపోవడంతో క్యాడర్ , ప్రజల్లో కొంత నిరాశ నెలకొంది. ఇప్పుడు కవిత సరిగ్గా అదే పాయింట్‌ను పట్టుకుని, టీఆర్ఎస్ పేరును మళ్లీ తెరపైకి తేవడం ద్వారా బీఆర్ఎస్ శ్రేణులను తనవైపు తిప్పుకోవాలని చూస్తున్నారు. ఎమ్మెల్యేలు తన పార్టీలోకి వస్తారని, టీఆర్ఎస్ పేరును తానే దక్కించుకుంటానని ఆమె చేస్తున్న వ్యాఖ్యలు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

# రూ.225 కోట్లతో 'బాసర' మాస్టర్ ప్లాన్ రెడీ..

**మొదటిపేజీ తరువాయి**

దృష్ట్యా ఈవీ వాహనాలనే అనుమతించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా కఠిన నిబంధనలు అమలు చేయాలని స్పష్టం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో ఆలయ పరిసరాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు జరగకుండా నియంత్రణలు ఉండాలని సీఎం పేర్కొన్నారు. భక్తులకు సౌకర్యాలు కల్పిస్తూ, ఆలయాన్ని అభివృద్ధి చేసే దిశగా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. బాసర ఆలయ అభివృద్ధిపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బాసర ఆలయ అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను సీఎంకు అధికారులు వివరించారు. మాస్టర్ ప్లాన్‌పై అధికారులకు పలు సూచనలు చేశారు సీఎం. ఆలయ అభివృద్ధి అద్భుతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భక్తుల విశ్వాసాలను గౌరవిస్తూ, శాస్త్ర ప్రకారం ఆలయ అభివృద్ధి ఉండాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను, రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాలమైన రోడ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆలయ పరిసరాల్లో ఈవీ వాహనాలను మాత్రమే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా నిబంధనలు కఠినతరం చేయాలని ఆదేశించారు. తిరుమల తరహాలో అన్ని ఆలయాల పరిసరాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు జరగకుండా నిబంధనలు ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సమావేశానికి మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి



రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ నెల 6న బాసర ఆలయ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. రూ.225 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు.

## "ఇందిరమ్మ రాజ్యం" పేరుతో గూండా రాజ్యమా?

- **కెసిఆర్ క్యాంప్ కార్యాలయంపై దాడి దుర్మార్గం**
- **సీఎం, మంత్రులు రాష్ట్ర పాలనను పట్టించుకోవడం లేదని ఆరోపణ**
- **పోలీసు వ్యవస్థ అధికార పార్టీకి అనుకూలంగా పనిచేస్తోందా?**
- **బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కార్యాలయాలపై దాడులకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చారా?**
- **దాడి చేసిన వారిని వెంటనే గుర్తించి అరెస్ట్ చేయాలని డీజీపీకి విజ్ఞప్తి**
- **కేసీఆర్ క్యాంపు కార్యాలయంపై దాడి.. సీఎం రేవంత్‌పై హరీశ్ రావు ఫైర్**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడి జరిగింది. కార్యాలయంపై కాంగ్రెస్ గూండాల దాడి చేశారని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. ఈ మేరకు శనివారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ముమ్మాటికీ ఇది సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో జరిగిన దాడి అని ఆరోపించారు. ప్రజాస్వామ్యంపై సీఎం చేయించిన దాడి అన్నారు. పట్టపగలు అధికార మదంతో విర్రవీగుతూ సోయి మరచి వ్యవహరిస్తున్న కాంగ్రెస్ నాయకుల తీరు బీహార్ గ్యాంగ్‌ను తలపిస్తోందన్నారు. ఏకంగా ప్రజా ప్రతినిధుల క్యాంపు కార్యాలయాల పైనే ముప్పేట దాడులు చేస్తుంటే రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉన్నట్లా లేనట్లా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజా ప్రతినిధులపై దాడులు, ప్రజా సంఘాలపై దాడులు, మీడియాపై దాడులు.. నిత్యకృత్యం కావడం సిగ్గుచేటన్నారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసు యంత్రాంగం కాంగ్రెస్ పార్టీకి ప్రైవేట్ సైన్యంలా మారిపోయారా? ఎందుకు అడ్డుకోవడం లేదు? అని ప్రశ్నించారు.

"ఒకవైపు "హేట్ స్పీచ్ బిల్" పేరుతో ప్రజలు, ప్రతిపక్షాల నోళ్లు మూయిస్తూ... మరోవైపు కాంగ్రెస్ గూండాలతో దాడులు చేయించడమేనా మీ ప్రజా పాలన? ఇందిరమ్మ రాజ్యం అని చెబుతూ... గూండా రాజ్యం అమలు చేస్తారా? సీఎం, మంత్రులు ఇతర రాష్ట్రాల్లో పొలిటికల్ టూర్లు చేస్తూ... పాలనను గాలికి వదిలేసారా? ముఖ్యమంత్రి, మంత్రులు ఇతర రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో ఉంటే... ఇక్కడ పాలనను ఎవరు చూస్తారు? బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కార్యాలయాలపై దాడులు చేయాలని సందేశాలు ఇచ్చారా? కాంగ్రెస్ నాయకులకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చారా? ఏడవ గ్యారంటీగా ప్రజాస్వామ్య పునరుద్ధరణ అని డబ్బా కొట్టి ఇప్పుడు, ఉన్న ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు. ఎమర్జెన్సీ పాలనను తలపిస్తున్నారు. మీ అణచివేతలకు, మీ నిర్బంధాలకు, మీ దాడులకు బిఆర్ఎస్ పార్టీ అదరదు బెదరదు. డిడి9 వార్తలో మిమ్మల్ని అడుగడుగునా నిలదీస్తూనే ఉంటం, ప్రజల తరఫున పోరాటం చేస్తూనే ఉంటాం. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పై దాడులు జరిపిన కాంగ్రెస్ గూండాలను గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని రాష్ట్ర డీజీపీని డిమాండ్ చేస్తున్నాం. ఇలాంటి దాడులు ఆపకపోతే.. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రజలే వీధుల్లోకి రావాల్సిన పరిస్థితి వస్తుంది. తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరిస్తున్నాం." అని హరీష్ రావు వ్యాఖ్యానించారు.

## 48 గంటల తర్వాత విధ్వంసమే..

- **హార్ముజ్ తెరవకుంటే దాడులు చేస్తాం..**
- **20 రెట్లు ఎక్కువ బలంతో ప్రతిదాడి**
- **అవసరమైతే ఇరాన్ పవర్ ప్లాంట్లపై దాడులు**
- **"ఇక ఆలస్యం కాకముందే ఒప్పందానికి రండి"**
- **ఇరాన్‌కు వార్నింగ్ ఇచ్చిన ట్రంప్..**



**నేషనల్‌బ్యూరో, (డిడి9 వార్త):**

మిడిల్ ఈస్ట్‌లో పరిణామాలు రోజురోజుకు ఉద్రిక్తంగా మారుతున్నాయి. ఫిబ్రవరి 28న ఇజ్రాయిల్, అమెరికా ఇరాన్‌పై దాడులు నిర్వహించాయి. అప్పటి నుంచి ఈ ప్రాంతంలో తీవ్ర యుద్ధం జరుగుతోంది. రెండు పక్షాలు కూడా తగ్గడం లేదు. ఇరాన్ ప్రతీకారంగా ఇజ్రాయిల్, గల్ఫ్ దేశాలపై దాడులు చేస్తోంది. ఇదిలా ఉంటే, చమురు రవాణాకు అత్యంత కీలకంగా ఉన్న హార్ముజ్ జలసంధిని ఇరాన్ తన ఆధీనంలోకి తీసుకోవడం ఇప్పుడు ప్రపంచాన్ని చమురు సంక్షోభంలోకి నెట్టింది.

ఇదిలా ఉంటే, డొనాల్డ్ ట్రంప్ హార్ముజ్‌పై ఇరాన్‌కు ఇచ్చిన డెడ్‌లైన్ మరో 48 గంటలతో ముగుస్తోంది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడి నుంచి తీవ్ర వ్యాఖ్యలు వచ్చాయి. తన సోషల్ మీడియా పోస్ట్‌లో.. " ఒప్పందానికి అంగీకరించి, హార్ముజ్ జలసంధిని తెరవడానికి ఇరాన్‌కు ఇప్పటికే సమయం ఇచ్చాము, కానీ ఇప్పుడు కేవలం 48 గంటలు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఈ గడువు దాటితే, అమెరికా ఇరాన్‌పై తీవ్రమైన దెబ్బ కొడుతుంది. గ్లోరీ టూ గాడ్." అని రాశారు. మార్చి 26న హార్ముజ్ జలసంధిని ఓపెన్ చేసి, ఒక ఒప్పందానికి రావాలని ట్రంప్ 10 రోజుల డెడ్ లైన్ విధించారు. ఇప్పుడు దీనికి మరో రెండు రోజులు మాత్రమే మిగిలి ఉంది. ఈ రెండు రోజుల తర్వాత అమెరికా ఎలాంటి దాడులకు దిగుతుందనే ఉత్కంఠ నెలకొంది.

## 'మూడింతలు'.. ముప్పుతిప్పలు

**మొదటిపేజీ తరువాయి**

అనివార్యమైంది.

**ఒక్కొక్కరికి పది నిమిషాలు.. తప్పని నిరీక్షణ**

సాధారణంగా ఒక కార్డుదారుడికి రేషన్ పంపిణీ చేయడానికి రెండు నిమిషాల సమయం సరిపోతుంది. ప్రస్తుతం సాంకేతిక చిక్కులతో ఒక్కో కార్డుకు కనీసం 10 నిమిషాల సమయం పడుతోంది. వేలిముద్రలు పడకపోయినా, సర్వర్ నెమ్మదించినా ఈ సమయం మరింత పెరుగుతోంది. ఈ పోస్ యంత్రంతో అనుసంధానమైన వేయింగ్ మిషన్‌పై తూకం వేయడం తప్పనిసరి. మొదటి నెల కోటా తూకం పూర్తై రసీదు వచ్చాక, మళ్లీ రెండో నెల కోసం బయోమెట్రిక్ వేయాలి, ఆపై మళ్లీ తూకం వేయాలి. ఇలా మూడుసార్లు చేయాల్సి వస్తోంది.

**గడువు ఉన్నా రద్దీ**

ప్రభుత్వ చౌకధరల దుకాణాల ద్వారా ఈ నెలలో మూడు నెలల బియ్యం పంపిణీ ప్రక్రియ ఈ నెల 30 వరకు కొనసాగుతుందని అధికారులు స్పష్టం చేసినప్పటికీ లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. 'ముందు వెళ్తేనే బియ్యం దొరుకుతాయి.. లేదంటే స్టాక్ అయిపోతుంది' అన్న భయం కార్డుదారులను తెల్లవారుజాము నుంచే రేషన్ షాపుల వద్ద క్యూ కట్టేలా చేస్తోంది. ఇప్పటికైనా సాఫ్ట్‌వేర్‌లో తగిన మార్పులు చేస్తే తప్ప ఈ రద్దీ తగ్గేలా కనిపించడం లేదని డీలర్లు అభిప్రాయపడుతున్నారు.



# నిరీక్షణకు తెర

**మొదటిపేజీ తరువాయి**

శనివారం నిర్వహించిన చైర్మన్ ఎన్నికలో బీఆర్ఎస్ పైచేయి సాధించింది.

**కాంగ్రెస్ వాకౌట్**

చైర్మన్ ఎన్నిక ప్రారంభం అయిన పది నిమిషాల్లో కాంగ్రెస్ వాకౌట్ చేసింది. పార్టీల బలాబలాలు స్పష్టం కావడంతో 8 మంది కాంగ్రెస్ నేతలు, మద్దతుగా ఉన్న ఒక బీజేపీ నేత, స్వతంత్ర అభ్యర్థి, ఎమ్మెల్యేలు సమావేశం మధ్యలోనే వెళ్లిపోయారు. ఇన్ని రోజుల సమయం దొరికినా బీఆర్ఎస్ సభ్యులను ఆకర్షించలేకపోయారు. అందుకే వాకౌట్‌తో ఓటమిని అంగీకరించారు.

**ఇచ్చిన మాట ప్రకారం వైస్ చైర్మన్**

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో బీజేపీ రెండు స్థానాలు గెలిచింది. అయినప్పటికీ బీజేపీకి బీఆర్ఎస్ వైస్ చైర్మన్ పదవి ఇచ్చింది. ఎందుకంటే ఉన్న ఇద్దరిలో ఒకరు కాంగ్రెస్ వైపు ఉంటే, ఇంకొకరు బీఆర్ఎస్ వైపు నిలబడ్డారు. ఆ మద్దతుకు ప్రతిఫలంగా వైస్ చైర్మన్ పదవి ఇచ్చింది.

**చైర్మన్, వైస్ చైర్మన్ వీళ్లే..**

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ చైర్మన్‌గా బీఆర్ఎస్ సభ్యులు టేకుల సుదర్శన్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైస్ చైర్మన్‌గా బీజేపీకి చెందిన ముత్యాల శ్యామలను ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నిక పరిశీలకులు వారి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఆ వెంటనే ఇద్దరూ బాధ్యతలు స్వీకరించారు. మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్యలో నిర్వహించారు. పట్నంలో బీఆర్ఎస్ నేతలు భారీ ర్యాలీలు నిర్వహించి, టపాసులు కాల్చి విజయోత్సవాలు చేసుకున్నారు.

**క్యాతనపల్లిలో కూడా..**

మరోవైపు, మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీని కూడా గులాబీ పార్టీ దక్కించుకున్నది. చైర్మన్‌గా బీఆర్ఎస్ అభ్యర్థి సంధ్యా రాణి ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్ పదవిని సీపీఐ అభ్యర్థి సరిత దక్కించుకున్నారు. ఈ ఎన్నికకు కూడా కాంగ్రెస్ కౌన్సిలర్లు దూరంగా ఉన్నారు. ఇక, ఖానాపూర్ ఎన్నిక సమయంలో కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. దీంతో అధికారులు వాయిదా వేశారు.








# పాఠశాలలపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- **విద్యా ప్రమాణాలు, మధ్యాహ్న భోజనం నాణ్యతపై ప్రత్యేక దృష్టి**

**ఆదిలాబాద్ జిల్లా బ్యూరో : (డిడి9 వార్త న్యూస్ )**

బజార్‌హత్నూర్ మండలం దిగ్నూర్ గ్రామం లోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ రాజర్షి షా శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజన నాణ్యతను స్వయంగా పరిశీలించారు. పాఠశాలలో వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్, మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని నిర్వాహకులకు ఆదేశించారు. వంటగది పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పాత్రలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సూచించారు. భోజన నాణ్యత విషయంలో ఎటువంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు.విద్యార్థులకు అందుబాటులో ఉన్న తాగునీటి సదుపాయాలను పరిశీలించిన కలెక్టర్, వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నీటి నిల్వ ట్యాంకులను నిరంతరం శుభ్రపరచాలని సూచించారు. పాఠశాల గదులు, మరుగుదొడ్ల నిర్వహణపై సమీక్ష నిర్వహించిన ఆయన, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు ఆహ్లాదకర వాతావరణంలో విద్యనందించాలని ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యా పురోగతిపై ఉపాధ్యాయులు, అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గ్రామంలో డ్రైనేజీ



సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ శ్రీనివాస్, మౌనిక, పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ నూర్ సింగ్, సూపరింటెండెంట్ ఇంజినీరింగ్ శ్రవణ్ కుమార్, ఈఈ చంద్రమోహన్, డీఈఈ రమణ, ఏఈఈ దివాకర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.







# భోస్రలో శివనామ సప్తాహానికి హాజరైన ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్శి షా!

- **పర్యటనలో బోసరా గ్రామ సమస్యలపై ఆరా పూర్తి చేయాలని ఆదేశాలుజారీ!**

**బజార్ హత్నూర్ ,ఏప్రిల్, 04 (డిడి 9వార్త ):-**

ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్శి షా శనివారం రోజు బజార్ హత్నూర్ మండలం భోస్ర గ్రామంలో భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్న అఖండ శివ నామ సప్తాహం కార్యక్రమాన్ని సందర్శించి పాల్గొన్నారు.ఈ సందర్భంగా భోస్ర గ్రామ సర్పంచ్ సుభాష్ తో పాటు మాజీ ఎంపీటీసీ గజానంద్ మాజీ సర్పంచ్ నందేశ్వర్లు కలెక్టర్కి స్వాగతం పలికి ,హృదయ పూర్వక అభినందనలు తెలిపారు. అనంతరం కలెక్టర్ భక్తులతో కలిసి శివ నామ పారాయణంలో పాల్గొని, అఖండ శివనామ సప్తాహ పూర్వ పరాలు కార్యక్రమం నిర్వహణ, విధివిధానం నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని ప్రజా సమస్యలపై ఆరా తీశారు.స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ గజానంద్ మాట్లాడుతూ, “మా గ్రామంలో తీవ్రమైన తాగునీటి సమస్య ఉందని,ఓపెన్ బావి ప్రస్తుతం మరమ్మతుల్లో ఉందని వివరించారు. సర్పంచ్ సుభాష్ మాట్లాడుతూ,“మా గ్రామ శ్మశాన వాటికకు వెళ్లేందుకు సరైన రహదారి లేదని చెప్పారు.అలాగే భోస్ర గ్రామ ట్యాంక్ నుంచి వచ్చే నీటి సరఫరా పైప్‌లైన్‌కు గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా కొందరు వ్యక్తులు రంధ్రాలు చేసి నల్ల కనెక్షన్లు తీసుకోవడం వల్ల సగం గ్రామానికి నీటి సరఫరా నిలిచి పోయిందని కలెక్టర్కుతెలిపారు .ఈ సమస్య మీద కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ, గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా ప్రభుత్వ ఆస్తికి నష్టం కలిగించి, ఇష్టానుసారంగా పైప్‌లైన్‌కు రంధ్రాలు చేసిన వారిపై తగిన చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానాలు విధించాలని సర్పంచ్,& సం



బంధిత పంచాయతీ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అదే విధంగా గ్రామంలోని నీటి సమస్య, శ్మశాన వాటిక దారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆయా శాఖ సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు, తహసీల్దార్ శ్యామ్ సుందర్,సర్పంచ్ సుభాష్, మాజీ ఎంపీటీసీ గజానంద్, ఆర్ ఐ నూర్సింగ్,పంచాయతీ సెక్రటరీశంకర్,నందేశ్వర్,అంగన్వాడీ టీచర్ రాణి,షేశేరావు, శివలింగ్,వారే మహేష్, మధుకర్,

# వడగండ్లవాన, ఈదురు గాలులతో మొక్క జొన్న, జొన్నరైతుల పంటలు దెబ్బ తిన్నవి.

- **పంటలకు ఆడుకొనే విషయం పట్లప్రభుత్వంతక్షణమే(రేపటి లోగా) స్పందించాలి.**
- **స్పందించని యెడల 6వ తేదీ సీఎం సభలో నిరసనకు దిగుతమని రైతుల డిమాండ్.**

**బజార్ హత్నూర్,ఏప్రిల్, 04:-(డిడి 9వార్తన్యూస్ ):-**

అకాల వర్షం.. వడగండ్లు,గాలి దుమారంతో దెబ్బతిన్న రైతులను ఆదుకోండి! బజార్హత్నూర్ మండల రైతులు కలిసి గత కొన్ని రోజులుగా కురిసిన వడగండ్ల వాన, గాలి దుమారం,రైతుల పంటలు మొక్కజొన్న,జొన్న పంటకు తీవ్ర నష్టం వాటిల్లిందని దీనికి సంబందించి గత రెండు రోజుల క్రితం బజార్ హత్నూర్ వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది.కానీ, ఇంతవరకు ప్రభుత్వం నుంచి స్పందన రాలేదు. కాన, శనివారం రోజు ఆదిలాబాద్ జిల్లా వ్యవసాయ అధి



కారికి వినతి పత్రం ఏవో ద్వారా మరోసారి విన్నవించమని కోరనైనది. జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ స్వామి తో చరవాణిలో రైతులు మాట్లాడుతూ మండల కేంద్రంలో చాలావరకు మొక్కజొన్న నష్టం జొన్న పంట నష్టం జరిగిందన్నారు. కానీ,ఇప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన చేయలేదు.రేపటి వరకు ప్రభుత్వం నుంచి ప్రకటన గానీ స్పందన గానీ రాకుంటే ఆరు తారీఖు న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభలో రైతులందరం కలిసి నిరసన వ్యక్తం చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలని, డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో దుబ్బుల చంద్ర శేఖర్,నేరడి లింగన్న, కందుర్ సంతు,గిద్ది శంకర్, తోకల లింగన్న, భగవాన్ తదితర రైతులు ఉన్నారు.



# సీ ఎం సభను విజయవంతం చేయండి...

- **డిసిసి కార్యదర్శిలు లోలపు పోశెట్టి.. చౌహాన్ హరి సింగ్**

**ఆదిలాబాద్ జిల్లా,**
**బోథ్ ఏప్రిల్ 04:(డి డి 9 వార్త )**

సోనాల మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎప్రిల్ 6 సోమవారం జరిగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు మాట్లాడుతూ ఈనెల 6న బజార్ హత్నూర్ మండలం పిప్పిరి గ్రామంలో జరిగే ముఖ్యమంత్రి సభకు సబ్బండ వర్గాలు, కాంగ్రెస్ శ్రేణులు, మహిళలు, యువకులు, కార్మికులు ,కర్షకులు రావాలని, ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు జుంగాల భోజన్న, సర్పంచుల సంఘం అధ్యక్షుడు చౌహాన్ వినోద్, సీనియర్ నాయకులు రామాయి రాము, బాశెట్టి. సుదర్శన్, మనేశ్వర్ సోమన్న, షేక్ మహిమూద్ భీంరావు పాటిల్, తుల. అజయ్ కుమార్ ,చిలుకూరి నరేందర్, రాజారాం, శ్రీనివాస్, చెట్లపెల్లి సుధీర్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# అడెల్లి మహా పోచమ్మ ఆలయ పునఃప్రతిష్టాపన

**ఆదిలాబాద్ జిల్లా బ్యూరో డిడి 9 వార్త**

అడెల్లి మహా పోచమ్మ ఆలయ పున్నఃప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు అమ్మ వారి విగ్రహాలతో పాటుగా మహాశివా, అధిశేష, మహా గణపతి, మహా నంది విగ్రహాలను ప్రతిష్టించారు. ఈ కార్యక్రమం లో భాగంగా నవగ్రహ పూజ, అభిషేకం, విగ్రహాల ప్రాణ ప్రతిష్ట కార్యక్రమలతో నిర్వహించడం అదేవిధంగా. వేద మాత్రలతో యజ్ఞంన్ని నిర్వహించి అన్నదాన మహా ప్రసాదాన్ని భక్తులకు అందజేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మ వారి కృపకు పాత్రులయ్యారు. విగ్రహ ప్రతిష్ట అనంతరం దేవత మూర్తులకు పూజలు నిర్వహించి ఆశీర్వచనలు పొందారు.



# తథాగత్ బుద్ధుని జయంతిని ప్రభుత్వం అధికారిక సాధారణ సెలవుగా ప్రకటించాలి.

**బజార్హత్నూర్, ఏప్రిల్ 04:(డిడి 9వార్త ):-**

ప్రపంచానికి శాంతిని,జ్ఞానాన్ని అందించిన తథాగత్ బుద్ధుని (గౌతమ బుద్ధుని )జయంతి (వైశాఖ శుద్ధ పౌర్ణమిని ) తెలంగాణ ప్రభుత్వం సాదారణ సెలవుగా ప్రకటించాలని దేగామ బౌద్ధ మహా సభ సంఘం అధ్వర్యంలో శనివారం రోజు బజార్ హత్నూర్ తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్కు ఒక వినతిపత్రం ఇచ్చారు.శాంతి, అహింసా మార్గం ద్వారా ప్రజలను శాంతి మార్గం వైపు మరల్చిన గౌతముడుపుట్టినరోజునాడు తెలంగాణలో లక్షలాది ప్రజలు, భక్తిలు భక్తి శ్రద్దలతో వైశాఖ పౌర్ణమి రోజు ఎంతో పవిత్రంగా జరుపుకోను నేపథ్యంలో ఈ సెలవును ప్రకటించటం తప్పనిసరి అని తెలిపారు. ఈ కార్యక్రమంలోకానిందే రాజారాం, కానిందే ఉద్దవ్,సర్వేప్రభాకర్, పాముల లక్ష్మణ్, కానిందే జగదీశ్, భగత్ సంతోష్,బౌడే సత్యేందర్,సర్వే లక్ష్మణ్లు ఉన్నారు.




# కాంగ్రెస్ లో చేరిన మరో యువ నాయకుడు...

- **ప్రజా సంక్షేమ పథకాలు ప్రతి గడపకు తీసుకెళ్తా..**

**బోథ్ ఏప్రిల్ 04:(డి డి 9 వార్త ):-**

సోనాల మండల కేంద్రానికి చెందిన మాజీ వార్డు సభ్యులు , బిఆర్ఎస్ సీనియర్ నాయకులు జీ. భోజరాజు ఈరోజు ఆదిలాబాద్ డిసిసి కార్యాలయంలో డిసిసి అధ్యక్షుడు నరేష్ జాదవ్, బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ , తెలంగాణ రాష్ట్ర విచారి విభాగ్ రాష్ట్ర కన్వీనర్ తుల అరుణ్ కుమార్ గార్ల సమక్షంలో ఈరోజు కాంగ్రెస్ పార్టీ చేరడం జరిగింది. సందర్భంగా భోజరాజు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీలో ఎన్నో ఏండ్లుగా పనిచేస్తున్న సముచిత స్థానం కల్పించకపోగా కనీసం కార్యకర్తలకు పట్టించుకునే పరిస్థితి లేదని అన్నారు. అందుకే కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామన్నారు. కార్యక్రమంలో డిసిసి కార్యదర్శిలు లోలపు పోశెట్టి, చౌహాన్ హరి సింగ్, బోథ్ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు జుంగాల భోజన్న, నాయకులు బోథ్, ఆదిలాబాద్ నియోజకవర్గం నాయకులు తదితరులు పాల్గొన్నారు.





## హనుమాన్ ఆలయానికి పల్లకి విరాళం

**బీర్కూర్, ఏప్రిల్ 04(డిడి9 వార్త):**

కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలంలోని బరంగెడ్గి గ్రామంలో హనుమాన్ ఆలయానికి భక్తులు పల్లకిని విరాళంగా అందజేశారు. గ్రామానికి చెందిన వడ్ల రాములు, వడ్ల నాగేష్ లు కలిసి హనుమాన్ స్వామి విగ్రహ,సీతారాముల విగ్రహాల ఊరేగింపుల కోసం ప్రత్యేకంగా తయారు చేసిన పల్లకిని ఆలయానికి సమర్పించారు.ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో భక్తిశ్రద్ధల మధ్య పూజలు నిర్వహించి పల్లకిని హనుమాన్ స్వాములకు అప్పగించారు. ఆలయ కమిటీ సభ్యులు మరియు హనుమాన్ స్వాములు దాతలైన వడ్ల రాములు, నాగేష్‌లను శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో జరిగే ఉత్సవాలు, శోభాయాత్రలు, పండుగల సమయంలో ఈ పల్లకి ఎంతో ఉపయోగపడుతుందని గ్రామ పెద్దలు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దాతలను అభినందించారు. హనుమాన్ స్వామి సేవలో భాగంగా గ్రామాభివృద్ధికి అందరూ సహకరించాలని వారు కోరారు.





## వరి కొనుగోలు కంట్రోల్ రూమ్ ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**కామారెడ్డి, ఏప్రిల్ 04(డిడి9 వార్త):**

జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు జిల్లా పరిపాలన కీలక చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శనివారం సివిల్ సప్లయ్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ 08468220051 అనే కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్‌ను ప్రజలకు అందుబాటులో ఉంచుతూ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎదురయ్యే సమస్యలు, సందేహాలు, కొనుగోలు ప్రక్రియకు సంబంధించిన వివరాల కోసం రైతులు ఈ నంబర్‌ను సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత, వేగం, సమర్థత పెంపొందించేందుకు ఈ కంట్రోల్ రూమ్ ఉపయోగపడుతుందని అధికారులు పేర్కొన్నారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విధాలుగా సహాయం అందిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్స్ అధికారి వెంకటేశ్వర్లు, డీఎం శ్రీకాంత్, డీసీఓ రామ్మోహన్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.







## ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గంలో వైస్ ప్రెసిడెంట్ గా

# భగునురే మాధవ్ రావ్ పటేల్ నియామకం .

- జిల్లా నాయకత్వంలో బిసి నాయకునికి సముచితమైన స్థానం.
- గ్రామస్థాయి నుండి యువకులను నాయకులను బలపరిచేందుకే అధిష్టానం నిర్ణయం.
- మారుమూల మండలానికి సముచితమైన స్థానం.





**పొన్న 04 ఏప్రిల్ (డీడీ9 వార్త న్యూస్):**

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పంచవతి హోటల్‌లో తెలంగాణ టిపిపిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కమిటీ నూతన కార్యవర్గం ఎన్నుకోవడం జరిగినది. ఈ కార్యక్రమంలో సిరికొండ మండలం పొన్న గ్రామానికి చెందిన భగునూరే. మాధవరావు పటేల్ ను ఆదిలాబాద్ జిల్లా డిసిసి వైస్ ప్రెసిడెంట్ గా తెలంగాణ టిపిపిసి అధ్యక్షులు శ్రీ.మహేష్ కుమార్ గౌడ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కావడానికి పార్టీని నమ్ముకుని ఇప్పటివరకు కొనసాగుతున్న వారిని గుర్తించి అదిలాబాద్ జిల్లా ను గ్రామస్థాయి నుండి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు అదిలాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షులుగా డాక్టర్ నరేష్ జాదవ్ ను నియమిస్తూ, డిసిసి వైస్ ప్రెసిడెంట్ గా భగునూరే.మాధవ్ పటేల్ ను నియమించడం జరిగిందని, ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నటువంటి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, ప్రతి ఒక్క లబ్ధిదారుడికి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను అందించాలని ఆయన అన్నారు. రానున్న రోజులలో కాంగ్రెస్ పార్టీ జెండా ఆదిలాబాద్ జిల్లాలో రెపరెపలాడుతుందని ఆయన అన్నారు.40 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ నుండి ఇతర పార్టీలకు మారకుండా కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా పార్టీని నమ్ముకుని, పార్టీ కోసమే సేవలు చేసిన మాధవ్ పటేల్ ను పార్టీ గుర్తించి తనకు సముచితమైన స్థానం అందించడం జరిగిందని ,ప్రజల మధ్యలో ఉన్న నాయకుడు, అధికారులతో కార్యకర్తలతో నాయకులతో మంచి అందరి కష్టసుఖాలలో తోడుండే నాయకుడుభగునూరే. మాధవరావు పటేల్ అని డిసిసి అధ్యక్షులు డాక్టర్.నరేష్ జాదవ్ గారు అన్నారు. ఈ సందర్భంలో తెలంగాణ టి పి సి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, అదిలాబాద్ డిసిసి అధ్యక్షులు నరేష్ జాదవ్, మాజీ ఎంపీ సోయం బాపూరావు, బోత్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్.బాపురావు, బోత్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే. గజేందర్, ఆదిలాబాద్ ఇంచార్జ్ కంది. శ్రీనివాస్ రెడ్డి, మాజీ డిసిసి అధ్యక్షులు సాజిద్ ఖాన్ మరియు పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక కొనుగోలుకు 'మన ఇసుక వాహనం' ఆన్‌లైన్ విధానం

- దరఖాస్తు తప్పనిసరిగా పోర్టల్ ద్వారా చేసుకోవాలి: జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



**కామారెడ్డి, ఏప్రిల్ 04(డిడి9 వార్త):**

జిల్లాలో గృహ నిర్మాణదారులకు, ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుకను సులభంగా అందించేందుకు ప్రభుత్వం "మన ఇసుక - వాహనం" ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆశిష్‌సాంగ్వాన్ తెలిపారు. ఈ విధానం ద్వారా ఇసుక సరఫరాలో పారదర్శకత, సమర్థత పెంపొందించడంతో పాటు ప్రజలకు సులభంగా ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇసుక అవసరమున్న వినియోగదారులు తప్పనిసరిగా ప్రభుత్వం అందుబాటులో ఉంచిన http://tgmiv.cgg.gov.in పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. దరఖాస్తు చేసిన తరువాత సంబంధిత పంచాయతీ సెక్రటరీ దానిని పరిశీలించి తహసీల్దార్‌కు పంపిస్తారు. అనంతరం తహసీల్దార్ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి అనుమతి మంజూరు చేస్తారని తెలిపారు.అనుమతి వచ్చిన తర్వాత దరఖాస్తుదారులు ఆన్‌లైన్‌లో చెల్లింపు చేయాలి. ఆ తర్వాత అనుమతి పొందిన ఇసుక రీచ్‌కు ట్రాక్టర్‌తో వెళ్లి సంబంధిత అధికారికి వచ్చిన QR కోడ్ చూపించి ఇసుకను తీసుకువెళ్లవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వ పనుల కోసం అవసరమైన ఇసుకకు సంబంధిత ప్రభుత్వ ఇంజనీరింగ్ అధికారి ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఇసుక ధరల వివరాలు ఇలా ఉన్నాయని కలెక్టర్ వివరించారు. ఇందిరమ్మ ఇళ్లకు రూ.14, స్థానిక గృహ నిర్మాణదారులకు రూ.900, ప్రభుత్వ పనులకు రూ.660 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఏదైనా కారణం చేత ఒక రీచ్ వద్ద ఇసుక అందుబాటులో లేకపోతే మరో రీచ్‌ను ఎంపిక చేసుకునే అవకాశం కూడా కల్పించినట్లు తెలిపారు.ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ విధానం ద్వారా ఇసుక సరఫరాలో పారదర్శకత పెరిగి మధ్యవర్తుల సమస్యలు తగ్గుతాయని పేర్కొన్నారు. కాబట్టి ఇకపై ఇసుక అవసరమున్న వారు తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసి, అనుమతులు పొందిన తర్వాత మాత్రమే ఇసుకను పొందాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సూచించారు.



## అన్నసాగర్ ఐకేపీ వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్

**కామారెడ్డి, ఏప్రిల్ 04(డిడి9 వార్త):**



కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలంలోని అన్నసాగర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ వరి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సందర్శించారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాల మహిళలతో పరస్పరంగా చర్చించి వరి కొనుగోలు ప్రక్రియ సజావుగా కొనసాగేందుకు పలు సూచనలు చేశారు. వరి కొనుగోలు కేంద్రాల్లో ట్యాబ్ ద్వారా నమోదు చేసే ఎంట్రీలను నిర్దిష్ట సమయానికి నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన అన్ని FAQ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. అలాగే రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా టార్పాలిన్లు, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలను సమృద్ధిగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చినప్పుడు ఎలాంటి సమస్యలు ఎదురుకాకుండా చర్యలు తీసుకోవాలని, వరి కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా మరియు వేగవంతంగా కొనసాగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అన్నసాగర్ సర్పంచ్, ఎల్లారెడ్డి ఆర్డీవో, డీసీఎస్ఓ, డీసీఓ, డీఎంసీఎస్, రెవెన్యూ శాఖ అధికారులు, ఐకేపీ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## త్రాగునీటి సమస్య పరిష్కారం పై అధికారులను ప్రశంసించిన కలెక్టర్

**కామారెడ్డి, ఏప్రిల్ 04(డిడి9 వార్త):**

కామారెడ్డి జిల్లా యెల్లారెడ్డి పట్టణంలోని ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్‌ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆకస్మికంగా సందర్శించి హాస్టల్ నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. హాస్టల్‌లోని పలు రికార్డులు, విద్యార్థుల హాజరు నమోదు పుస్తకాలు (అటెండెన్స్ రిజిస్టర్లు)ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా గతంలో హాస్టల్‌లో త్రాగునీటి సమస్య ఉండటంతో రూ.2.00 లక్షల వ్యయంతో బోర్‌వెల్ మరియు పంప్‌సెట్ ఏర్పాటు చేసిన విషయాన్ని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ప్రస్తుతం త్రాగునీటి సౌకర్యం, భోజన ఏర్పాట్లు, విద్యార్థులకు అందిస్తున్న సేవల గురించి కలెక్టర్ విద్యార్థులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా హాస్టల్‌లో అన్ని మౌలిక సదుపాయాలు సమృద్ధిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత, భోజన నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అనంతరం కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ హాస్టల్ విద్యార్థులతో కలిసి భోజనం చేసి వారి సమస్యలు, అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో, ఎంఆర్ఓ, ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్, ట్రైబల్ వెల్ఫేర్ రీజినల్ కోఆర్డినేటర్ తదితర అధికారులు పాల్గొన్నారు.







# దళిత సర్పంచ్ కుల వివక్ష

- కొత్తపల్లి గ్రామం లో ఘటన

**నిజామాబాద్ కోటగిరి ఏప్రిల్ 04 (డిడి9 వార్త):**



నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం లోని కొత్తపల్లి గ్రామ దళిత సర్పంచు పూప్పల గంగారం పై వివక్ష చూపడం దారుణమని దళిత సంఘ నాయకులు అన్నారు. దళిత సర్పంచ్ పై జరిగిన అవమానం కి నిరసనగా నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలోని డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం దగ్గర ధర్నా చేసి నిరసన తెలుపడం జరిగింది. ఈ సందర్భంగా దళిత సంఘ నాయకులు మాట్లాడుతూ కొత్తపల్లి గ్రామంలో గత పది సంవత్సరాల క్రితం అప్పటి సర్పంచి సైదయ్యకు కూడా ఇదే రకమైన అవమానం జరిగిందని, అదే అవమానం మళ్ళీ రెండోసారి కూడా జరగడం సిగ్గుచేటని మండి పడడం జరిగింది, గతంలో అప్పటి మండల అధ్యక్షులు ఎజాస్కాన్ కు చెప్పడం జరిగిందని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసు కెళ్లడం జరిగిందని, అయినప్పటికీ రెండోసారి గ్రామానికి ప్రథమ పౌరుడు అయిన సర్పంచును వివక్ష చూపడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నల వర్షం కురిపించారు. కొత్తపల్లి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల లో భాగంగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి హాజరు కావడం జరిగిందని, ముదిరాజు సంఘ భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి దళిత సర్పంచ్ గ్రామానికి ప్రథమ పౌరుడు గంగారం ను పిలువకపోవడం, ఆహ్వానించకపోవడం చాలా సిగ్గుచేటని దళితులనే చిన్న చూపుతోనే ఆహ్వానించడం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సాక్షాత్తు దేశానికి ఆదర్శంగా నిలిచి, బాన్సువాడ నియోజకవర్గాన్ని అభివృద్ధి దశలో కొనసాగిస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి సాక్షిగా పిలువకపోవడం దారుణమని దీని మీద ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి స్పందించాలని లోకల్ గా ఎవరైతే వివక్ష చూపడానికి ప్రధాన కారకులు అయ్యారు, అలాంటి వారిపై చర్యలు తీసుకొని క్షమాపణ చెప్పే విధంగా చూడాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని దళిత సంఘ నాయకులు హెచ్చరికలు చేయడం జరిగింది. అవసరమైతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి అదేవిధంగా స్పీకర్ దృష్టికి తీసుకువెళ్తామని హెచ్చరికలు చేశారు. రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషనర్ తో పాటు జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషనర్ను కూడా ఆశ్రయించి జరిగిన అవమానంపై ఫిర్యాదు చేస్తామని, ఆందోళనలు రాష్ట్ర వ్యాప్తంగా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘ నాయకులు కొత్తపల్లి సర్పంచ్ పుప్పల గంగారం. పుప్పల దత్తు గ్రామ ఎస్సీ కమిటీ అధ్యక్షులు పుప్పల మారుతి పుప్పల సైదయ్య రాంపూర్ సర్పంచ్ శంకర్. సుద్దులం తాండ సర్పంచ్ విజయ్. పుప్పల గణేష్ రాములు మారుతి బి గంగారాం సైదయ్య సునీల్ హనుమాన్లు వడ్డెయ్య భూమేష్ మిర్జాపూర్ సాయిలు తుకారాం రాము తదితరులు పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం రైతులు దళారులను ఆశ్రయించవద్దు: పోచారం

**బాన్సువాడ, ఏప్రిల్ 04(డిడి9 వార్త):**

బాన్సువాడ నియోజకవర్గ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మన్ కాసుల బాలరాజు కూడా ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా బాన్సువాడ నియోజకవర్గంలోని పోతంగల్ మండల కేంద్రం మరియు కోటగిరి మండలం కొత్తపల్లి గ్రామంలో యాసంగి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పోచారం శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. రైతులు తొందరపడి దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తమ ధాన్యాన్ని తీసుకువచ్చి గిట్టుబాటు ధర పొందాలని ఆయన సూచించారు. ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం A గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ.2389, B గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ.2369 చెల్లించనున్నట్లు తెలిపారు.అనంతరం కోటగిరి మండలం కొత్తపల్లి గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన ముదిరాజ్ సంఘం కళ్యాణ మండపాన్ని మరియు రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రం (హెల్త్ సబ్ సెంటర్) ను పోచారం శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పోతంగల్, కోటగిరి మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.








## రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి: కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**కామారెడ్డి, ఏప్రిల్ 04(డిడి9 వార్త):**



రబీ యాసంగి 2025-26 సీజన్‌కు సంబంధించి వరి ధాన్యం కొనుగోలు ఏర్పాట్ల పై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల నుండి వరి ధాన్యాన్ని సమర్థవంతంగా కొనుగోలు చేయడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) ప్రకారం గ్రేడ్-1 వరికి క్వింటాలుకు రూ.2389,సాధారణ రకం వరికి క్వింటాలుకు రూ.2369గా నిర్ణయించబడిందని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత, వేగం కోసం ప్యాక్స్, ఐకేపీ సిబ్బంది మరియు ఇతర సంబంధిత సిబ్బందికి ప్రోక్యూర్మెంట్ యాప్ వినియోగంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. యాప్ ద్వారా నమోదు విధానం, ధాన్యం రికార్డింగ్, చెల్లింపుల ప్రక్రియలపై వారికి వివరంగా శిక్షణ ఇచ్చారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాలలో తగిన సదుపాయాలు కల్పించాలని, ధాన్యం తూకం, నిల్వ, రవాణా ఏర్పాట్లు సమర్థవంతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా ఎండాకాలం నేపథ్యంలో రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## ముఖ్యమంత్రి బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

**బజార్హత్నూర్, ఏప్రిల్, 04:(డిడి 9వార్త న్యూస్ ):-**

ఈ నెల 6వ తేదీ, సోమవారం నాడు రాష్ట్ర ముఖ్యమంత్రి పిప్రి పర్యటన సందర్భంగా నిర్వహించనున్న బహిరంగ సభ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్ ఈరోజు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సభ ప్రాంగణం, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ మళ్లింపు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి సంబంధిత అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. విధుల్లో పాల్గొనే సిబ్బందికి కేటాయించిన స్థలాలు, ప్రజల కోసం ఏర్పాటు చేసిన గ్యాలరీలను కలెక్టర్ స్వయంగా తనిఖీ చేశారు. సభను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భద్రతా పరంగా ఎలాంటి లోపాలు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.



## హెల్మెట్ ధరించండి – డ్రంక్ అండ్ డ్రైవ్ చేయవద్దు: పోలీసుల సూచనలు




**కామారెడ్డి, ఏప్రిల్ 04(డిడి9 వార్త):**



కామారెడ్డి బస్టాండ్ ఆవరణలో శనివారం పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా బంగారు నగలను జాగ్రత్తగా సంరక్షించుకోవాలని ప్రజలకు సూచించారు. అలాగే రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనం నడపవద్దని అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఓటీపీ వివరాలను ఎవరికీ చెప్పవద్దని సూచించారు. సైబర్ నేరాలకు సంబంధించిన ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్ 1930 కు కాల్ చేయాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 కు సమాచారం ఇవ్వాలని చెప్పారు. మహిళల రక్షణ కోసం షీ టీమ్ పనిచేస్తుందని, అవసరమైతే 972686094 నంబర్‌ను సంప్రదించాలని వివరించారు. పోలీస్ కళాబృందం ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుల్ రామంచ తిరుపతి, హెడ్ కానిస్టేబుల్ శేషారావు, పీసీలు ప్రభాకర్, సాయిలు మాటలు, పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కంట్రోలర్ అలీ పాషా, డ్రైవర్లు, కండక్టర్లు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రయాణికులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలి

**నిజామాబాద్ జిల్లా 04ఏప్రిల్ (డీడీ9 వార్త) :**

కమ్మర్‌పల్లి మండలంలోని నాగపూర్ గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఎంపీడీవో రాజ శ్రీనివాస్ లబ్ధిదారులను కోరారు. శనివారం ఆయన గ్రామ సర్పంచ్ అశోక్‌తో కలిసి గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న వివిధ ఇళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై లబ్ధిదారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ నెల 20వ తేదీ నాటికి ప్రతి ఇల్లు పూర్తి కావాలని, అప్పుడే నిధుల విడుదలకు ఎలాంటి ఆటంకం ఉండదని స్పష్టం చేశారు. పనుల్లో జాప్యం చేయకుండా వేగవంతం చేయాలని లబ్ధిదారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సంధ్య, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి అండ

**నిజామాబాద్ జిల్లా 04ఏప్రిల్ (డీడీ9 వార్త) :**

వివిధ అనారోగ్య కారణాలతో ఆస్పత్రుల్లో చికిత్స పొంది, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలిచిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకేట రవి పేర్కొన్నారు. శనివారం కమ్మర్‌పల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముగ్గురు లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన సహాయ నిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన కొత్తపల్లి దేవాయికి రూ. 32,000, కొంటి కంటి లక్ష్మికి రూ. 53,000, మరియు కొమ్ముల రాజకుమార్‌కు రూ. 13,500 విలువైన చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ఆపదలో ఉన్న వారికి ఈ నిధి ఎంతో భరోసానిస్తుందని అన్నారు. తమకు ఈ ఆర్థిక సాయం అందేలా ప్రత్యేక చొరవ తీసుకున్న బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ రెడ్డికి లబ్ధిదారులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.







# దేగామ ఆర్ఆర్ కాలనీలో నీటి సమస్యను పరిష్కరించండి

- **అధికారులకు జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశం.**

**బజార్ హత్నూర్, ఏప్రిల్, 04 (డిడి 9వార్త న్యూస్ ):**

ఆదిలాబాద్ జిల్లా బజార్హత్నూర్ మండలం లోని దేగామ గ్రామ పునరావాస కాలనీ ఆర్ఆర్ కాలనీ లో నెలకొన్న తాగునీటి సమస్యను జిల్లా కలెక్టర్ రాజర్షి షా శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కాలనీ వాసులు ఎదుర్కొం టున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్న ఆయన, సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నీటి ఎద్దడిపై ఆరా కాలనీలో గత కొన్ని రోజులుగా తాగునీటి సరఫరా సరిగా లేకపో వడంపై స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. దీనిపై స్పందించిన ఆయన, నీటి సరఫరాలో అంతరాయానికి గల కారణాలను మిషన్ భగీరథ అధికారులను అడిగి తెలు సుకున్నారు. నీటి సరఫరా వ్యవస్థను, పైపు లైన్లను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఎక్కడైనా లీకేజీలు ఉన్నాయా లేదా సాంకేతిక లోపాలు ఉన్నాయా అన్నది తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కాలనీ మహిళలతో మాట్లాడారు. నీరు ఎన్ని రోజులకు ఒకసారి వస్తోంది? సరిపడా వస్తోందా? అని ఆరా తీశారు. ఆర్ఆర్ కాలనీలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా తక్షణమే మరమ్మతులు చేపట్టాలి. పంచాయతీ మిషన్ భగీరథ అధికారులు సమన్వయంతో పనిచేసి, ప్రతి ఇంటికి నీరు అందేలా పర్యవేక్షించాలి. అని తెలిపారు



ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ శ్రీనివాస్,RI నూర్ సింగ్, ఎస్ఈ శ్రవణ్ కుమార్, ఈఈ చంద్రమోహన్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు



# నిరాశ్రయుడికి ఆశ్రయం

## కుటుంబానికి కలిపిన కలెక్టర్ మానవతా స్పర్శ

**కామారెడ్డి, ఏప్రిల్ 04(డిడి9 వార్త):**

మానవత్వానికి ప్రతిరూపంగా నిలిచిన కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మరోసారి తన సేవాభావాన్ని చాటుకున్నారు. రోడ్డు పై నిరాశ్రయంగా తిరుగుతున్న ఒక గుర్తు తెలియని మానసిక అస్వస్థత గల వ్యక్తిని గుర్తించి అతనికి సహాయం అందేలా చర్యలు తీసుకోవడం ద్వారా ఒక కుటుంబానికి తిరిగి ఆనందాన్ని తీసుకొచ్చారు. గత నెల 31వ తేదీన రోడ్డుపై నిరాశ్రయంగా తిరుగుతున్న ఆ వ్యక్తిని స్వయంగా గుర్తించిన కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ వెంటనే జిల్లా సంక్షేమ అధికారిని ఆదేశించి అతనికి తక్షణ సహాయం అందించాలని సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా సంక్షేమ శాఖ పర్యవేక్షణలో ప్రభుత్వ వృద్ధాశ్రమ సిబ్బంది ఆ వ్యక్తిని తమ సంరక్షణలోకి తీసుకుని ఆహారం, శుభ్రత, వైద్య సేవలు అందించారు. తర్వాత అతను జగిత్యాల జిల్లాకు చెందిన వాడని గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహించి, శుభ్రపరిచే కార్యక్రమం చేపట్టి అతని ఆరోగ్య పరిస్థితిని మెరుగుపరిచేలా చికిత్స అందించారు. అనంతరం ఈ విషయాన్ని అతని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. శనివారం (ఏప్రిల్ 04) కలెక్టర్ చాంబర్లో ఆ వ్యక్తి కుటుంబ సభ్యులు కలెక్టర్ను కలిసి 25 సంవత్సరాల తర్వాత తమ కుటుంబ సభ్యుడు తిరిగి లభించిన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మానవత్వాన్ని కొనియాడారు. ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సంఘటన ద్వారా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మానవత్వం, సేవాభావం, బాధ్యతాయుత పరిపాలనకు నిదర్శనంగా నిలిచారని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# పేకాట స్థావరంపై సీసీఎస్ దాడి

- **నలుగురు వ్యక్తుల అరెస్టు నగదు, వాహనాలు స్వాధీనం**

**నిజామాబాద్ జిల్లా 04ఏప్రిల్ (డీడీ9 వార్త) :**


జక్రాన్పల్లి మండల పరిధిలోని కలిగొట్ గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై శనివారం సీసీఎస్ పోలీసులు మెరుపుదాడి చేశారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆదేశాల మేరకు సీసీఎస్ ఏసీపీ మస్తాన్ అలీ పర్యవేక్షణలో ఈ దాడులు నిర్వహించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కలిగొట్ శివారులో కొందరు పేకాట ఆడుతున్నట్లు అందిన నమ్మదగిన సమాచారంతో సీసీఎస్ బృందం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టింది. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ.10,940 నగదుతో పాటు నాలుగు వాహనాలు, మూడు సెల్ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న నిందితులను, స్వాధీనం చేసుకున్న సొత్తును తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం జక్రాన్పల్లి పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓకు అప్పగించినట్లు అధికారులు వెల్లడించారు. జిల్లాలో జూదం, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.




# ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌కు ఘన స్వాగతం పలికిన శ్రీకాంత్ రెడ్డి

**ఆదిలాబాద్, ఏప్రిల్ : 04 (డిడి 9వార్త ప్రతినిధి ):-**

డీసీసీ నూతన కార్యవర్గం,యాక్షన్ కమిటీ మీటింగ్ సందర్భంగా నేడు ఆదిలాబాద్ జిల్లాకు విచ్చేసిన టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కు , ఏఐసిసి సెక్రెటరీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ సచిన్ సావంత్ ని మావల బైపాస్ వద్ద పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి ఘన స్వాగతం పలికిన తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి . ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు నరేష్ జాదవ్ , జిల్లా ముఖ్య నేతలతో కలిసి మహేష్ కుమార్ గౌడ్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ జెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం జిల్లా జరిగిన యాక్షన్ కమిటీ మీటింగ్ లో మహాత్మ గాంధీ, బాబా సాహెబ్ అంబెడ్కర్ ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ చేతులమీదుగా ఇటీవల నూతనంగా నియమితులైన డిసిసి కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలను అందజేసి అభినందనలు తెలియజేసారు. కరుడుగట్టిన కాంగ్రెస్ కార్యకర్తల వల్లే తాము తెలంగాణలో అధికారంలోకి వచ్చామని వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 100 సీట్లకు పైగా గెలుస్తామని అన్నారు. బీఆర్ఎస్ నిర్బంధ పాలనలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు కేసుల పాలలై లాఠీలు దెబ్బలు తిన్నారని చెప్పారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ గెలిచి రాహుల్ ప్రధాన మంత్రి అవుతారని పేర్కొన్నారు. సన్నబియ్యం పథకం దేశంలోనే చారిత్రాత్మకమన్నారు .ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు రైతు భరోసాతో వ్యవసాయానికి మంచి రోజులు తెచ్చామని గుర్తుచేశారు. పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని అన్నారు. ప్రజా ప్రభుత్వం తీసుకువచ్చిన సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలో తీసుకువెళ్లి పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలన్నారు.





# రైతులకు ఇబ్బంది లేకుండా మొక్కజొన్న కొనుగోళ్లు

- **కమ్మర్‌పల్లి, ఉప్లూర్ శాఖల్లో కేంద్రాల ప్రారంభం**
- **ఏఎంసీ చైర్మన్ నరసయ్య, పీఐసీ అధ్యక్షుడు రమన్‌కుమార్**

**నిజామాబాద్ జిల్లా 04ఏప్రిల్ (డీడీ9 వార్త) :**

రైతులు పండించిన మొక్కజొన్న పంటను మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కొనుగోళ్లు సాగాలని ఏఎంసీ చైర్మన్ పాలెపు నరసయ్య, పీఐసీ అధ్యక్షుడు రమన్‌కుమార్ అన్నారు. శనివారం కమ్మర్‌పల్లి మండల కేంద్రంతో పాటు ఉప్లూర్ శాఖ పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వారు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి కొనుగోళ్లను లాంఛనంగా మొదలుపెట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ శైలేందర్ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కనీస సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ధాన్యం సేకరించిన వెంటనే తూకంలో జాప్యం లేకుండా చూడాలని, బాధితులకు అందాల్సిన నగదును వీలైనంత త్వరగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ ఛైర్మన్ బుచ్చన్న, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకేట రవి, గ్రామ కమిటీ అధ్యక్షుడు జెల్ల సదానంద్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కొమ్ముల రవీందర్, నాయకులు ఏలేటి మోహన్ రెడ్డి, బోనగిరి భాస్కర్, బద్దం తిరుపతి రెడ్డి, బద్దం రాజేశ్వర్, అవారి సత్యం, సాదుల్లా, నరేష్, అజయ్, రాకేష్, అంజిత్, రాజశేఖర్, సాయన్న, విజయ్, దినేష్‌లతో పాటు వ్యవసాయ అధికారి రమేష్, పీఏసీఎస్ కార్యదర్శి శంకర్, సంఘ సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిరికొండ మండల్ తహసిల్దార్ కి వినతి పత్రం అందజేత.

**సిరికొండ 04 ఏప్రిల్ (డిడి9 వార్త న్యూస్ ):**

ఈరోజు సిరికొండ మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షులు గురుమూర్తి మాట్లాడుతూ మే నెల మొదటి తేదీన బుద్ధ పౌర్ణమి సందర్భంగా సిరికొండ మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు దినం గా ప్రకటించాలని, ఆదిలాబాద్ జిల్లా లోని అన్ని మండలాలలో తాసిల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్నామని అదే సందర్భంలో సిరికొండ మండలం తాసిల్దార్ కార్యాలయంలో బుద్ధ పౌర్ణమి రోజు సెలవుదినంగా ప్రకటించాలని వినతిపత్రం అందజేశామని ఆయన అన్నారు. ఈ సందర్భంలో సోంపల్లి, పొన్న, సిరికొండ, రాంపూర్, గ్రామాల కమిటీ నాయకులు తాగత్ భగవాన్ బుద్ధుడు వైశాకి బుద్ధ పూర్ణిమ రోజు ప్రభుత్వం సెలవులు ప్రకటించాలని ఎమ్మార్వో గారికి వినతిపత్రం అందజేయడం జరిగిందని, ప్రెసిడెంట్ గురుమూర్తి, వైస్ ప్రెసిడెంట్ పాటిల్.పెంటన్న(పొన్న),డాక్టర్ శీను,సోంపల్లి గ్రామ సర్పంచ్ లక్ష్మీకాంత్, అనిల్ సొంకాంబ్లె ఉపసర్పంచ్ విలాస్, గొడబోలె.రవి, సునీల్,సుభాష్, మరియు తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్ర స్థాయి హాకీలో భుక్య అశ్విని ప్రతిభ

- **సీఎం కప్‌లో ద్వితీయ బహుమతి కైవసం**
- **భీంగల్ మండలం రూప్లతండాలో హర్షా తిరేకాలు**

**నిజామాబాద్ జిల్లా 04ఏప్రిల్ (డీడీ9 వార్త) :**

మట్టిలో మాణిక్యంలా గ్రామీణ ప్రాంత క్రీడాకారిణి రాష్ట్ర స్థాయిలో మెరిసింది. భీంగల్ మండలం రూప్లతండాకు చెందిన భుక్య అశ్విని రాష్ట్ర స్థాయి క్రీడల్లో అద్భుత ప్రతిభ కనబరిచి రన్నరప్‌గా నిలిచింది. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన 2వ ఎడిషన్ సీఎం కప్ 2025 26 పోటీల్లో భాగంగా హాకీ విభాగంలో ఆమె తన నైపుణ్యాన్ని చాటుకుంది. రూప్లతండాకు చెందిన భుక్య వినోద్ కుమార్తె అయిన అశ్విని, అండర్13 విభాగంలో జరిగిన హాకీ పోటీల్లో పాల్గొని ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. గ్రామీణ నేపథ్యం నుండి వచ్చి, సరైన వసతులు లేకున్నా పట్టుదలతో ఆడి రాష్ట్ర స్థాయిలో రాణించడం పట్ల జిల్లా క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అశ్విని సాధించిన ఈ విజయం పట్ల గ్రామ సర్పంచ్ భూక్యా సర్దార్, ఉప సర్పంచ్ బోడ అరణ్, కుటుంబ సభ్యులు మరియు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో జాతీయ స్థాయిలో ఆడి జిల్లాకు, రాష్ట్రానికి మరిన్ని పతకాలు తీసుకురావాలని కోరుతూ ఆమెను అభినందించారు. ఈ విజయం తండాలోని ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పలువురు కొనియాడారు.



# పేదల సొంతింటి కల సాకారం

**నిజామాబాద్ జిల్లా 04ఏప్రిల్ (డీడీ9 వార్త) :**

ప్రతి పేదవాడికి సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకేట రవి అన్నారు. శనివారం కమ్మర్‌పల్లి మండలంలోని అమీర్‌నగర్ గ్రామంలో ఇంద్రాల పెద్దమ్మికి మంజూరైన ఇందిరమ్మ ఇల్లు పూర్తి కావడంతో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమీర్‌నగర్ గ్రామంలో మొదటి విడతలో 29 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, అందులో 24 ఇళ్లు ఇప్పటికే నిర్మాణ పనులు పూర్తి చేసుకుని తుది దశకు చేరుకున్నాయని తెలిపారు. గ్రామంలో అర్హులైన పేదలు ఇంకా ఎవరైనా ఉంటే, వారందరికీ దశలవారీగా ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. గడువులోగా లబ్ధిదారులు



నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శ్రీరాముల మురళి, నాయకులు భూమా రెడ్డి, పుప్పాల నర్సయ్య, క్యాతం గంగారెడ్డి, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.



# బోధన్‌లో 'హ్యుందాయ్ ఎక్స్‌టర్' ఫేస్‌లిఫ్ట్ ఆవిష్కరణ

- **అత్యాధునిక ఫీచర్లతో సరికొత్త వాహనం ప్రకాష్ హ్యుందాయ్ షోరూంలో వేడుకగా ప్రారంభం**

**బోధన్, నిజామాబాద్ జిల్లా 04ఏప్రిల్ (డీడీ9 వార్త) :**

వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా అత్యాధునిక సాంకేతికత, భద్రతా ప్రమాణాలతో రూపొందించిన హ్యుందాయ్ ఎక్స్‌టర్ ఫేస్‌లిఫ్ట్ వాహనాన్ని బోధన్ పట్టణంలో శనివారం ఆవిష్కరించారు. ప్రకాష్ హ్యుందాయ్ షోరూంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సీఈఓ నల్లా ప్రతీష్ రెడ్డి పర్యవేక్షించగా, పలువురు ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. లయన్స్ క్లబ్ వ్యవస్థాపకులు బసవేశ్వర రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేశ్వరరావు దేశాయ్, ఉపాధ్యక్షులు విద్యాసాగర్, మున్సిపల్ వైస్ చైర్మన్ మీర్ ఇలియాస్ అలీ, కౌన్సిలర్ అలీమ్ రాజా, పెగడపల్లి సర్పంచ్ సుదర్శన్, కొప్పర్గా మాజీ సర్పంచ్ జమీల్ పటేల్, పావులూరి వెంకటేశ్వర్ రావు తదితరులు కలిసి వాహనాన్ని ఆవిష్కరించారు. షోరూం మేనేజర్ రమేష్ పాటిల్ ఆధ్వర్యంలో అతిథులు కేక్ కట్ చేసి, వాహనాన్ని పరిశీలించి టెస్ట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ నల్లా ప్రతీష్ రెడ్డి మాట్లాడుతూ.. సరికొత్త డిజైన్, వినూత్న ఫీచర్లతో ఎక్స్‌టర్ ఫేస్‌లిఫ్ట్‌ను రూపొందించినట్లు తెలిపారు. పెట్రోల్ మరియు సిఎన్‌జీ వేరియంట్లలో అందుబాటులో ఉన్న ఈ వాహనం, ప్రారంభ ధర సుమారు రూ.10 లక్షల నుండి ఉంటుందని వెల్లడించారు. భద్రతకు పెద్దపీట వేస్తూ రూపొందించిన ఈ మోడల్ కస్టమర్లను విశేషంగా ఆకట్టుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో షోరూం సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.



# అకాల వర్షం.. అన్నదాతకు తీరని శోకం

- **సాలూర మండలంలో వడగళ్ల వాన బీభత్సం**
- **నేలపాలైన వరి, మొక్కజొన్న పంటలు**
- **ఖాజాపూర్, హున్సా, మందర్న గ్రామాల్లో తీవ్ర నష్టం**
- **కన్నీరుమున్నీరవుతున్న రైతులు.. ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపు**

**బోధన్, నిజామాబాద్ జిల్లా 04ఏప్రిల్ (డీడీ9 వార్త) :**



ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్లుగా కురిసిన అకాల వర్షం, వడగళ్ల వాన సాలూర మండలంలోని రైతాంగాన్ని నిలువునా ముంచేసింది. శనివారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయి, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. మండల కేంద్రంతోపాటు పరిసర గ్రామాల్లో వడగళ్ల వాన బీభత్సం సృష్టించడంతో చేతికొచ్చిన పంటలు కళ్లముందే నేలపాలయ్యాయి. ముఖ్యంగా వరి, మొక్కజొన్న పంటలకు తీరని నష్టం వాటిల్లింది. సాలూర మండలంలోని ఖాజాపూర్, హున్సా, మందర్న తదితర గ్రామాల్లో వడగళ్ల తాకిడికి వరి గింజలు రాలిపోయి పొలమంతా తెల్లగా కనిపిస్తోంది. కోతకు సిద్ధంగా ఉన్న తరుణంలో ఈ విపత్తు సంభవించడంతో రైతులు లబోదిబోమంటున్నారు. మొక్కజొన్న చేలు గాలివానకు నేలవాలడంతో కనీసం పశువుల మేతకు కూడా పనికిరాకుండా పోయాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం కష్టపడి, అప్పులు తెచ్చి పెట్టుబడి పెడితే.. చివరకు ప్రకృతి ప్రకోపానికి బలైపోయామని అన్నదాతలు కన్నీరుమున్నీరవుతున్నారు. తక్షణమే వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి మండలంలోని ప్రతి గ్రామంలో పర్యటించి, పంట నష్టాన్ని అంచనా వేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఏడాది పొడవునా కష్టపడి పండించిన పంట చేతికి వచ్చే సమయంలో ఇలా జరగడం మా దురదృష్టం. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఎకరాకు ₹20 వేల చొప్పున పరిహారం చెల్లించి మమ్మల్ని ఆదుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# అక్రమ నిర్మాణాలపై పోలీసులకు ఫిర్యాదు

- **తమ స్థలంలో దౌర్జన్యంగా భవన నిర్మాణం**

**బోధన్, నిజామాబాద్ జిల్లా 04ఏప్రిల్ (డీడీ9 వార్త) :**

బోధన్ పట్టణంలోని విష్ణు భవన్ సమీపంలో గల తమ సొంత స్థలంలో కొందరు వ్యక్తులు అక్రమంగా భవన నిర్మాణాలు చేపడుతున్నారని వైద్యురాలు డాక్టర్ మునవర్ సిరాజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. తన తండ్రికి సంబంధించిన వారసత్వ ఆస్తిపై కొందరు కన్ను వేశారని ఆరోపించారు. విష్ణు భవన్ సమీపంలోని తమ స్థలం తమకు సంక్రమించగా, సదరు స్థలంలో కొందరు వ్యక్తులు బిల్డర్లను సంప్రదించి అక్రమంగా భవన నిర్మాణం సాగిస్తున్నారని ఆమె తెలిపారు. ఈ నిర్మాణానికి సంబంధించి మున్సిపాలిటీ నుండి ఎలాంటి అనుమతులు లేవని, అలాగే యజమానులైన తమ నుండి కూడా ఎటువంటి అంగీకారం తీసుకోలేదని స్పష్టం చేశారు. దౌర్జన్యంగా స్థలాన్ని కబ్జా చేసి పనులు సాగిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమంగా జరుగుతున్న ఈ నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేయాలని, తమ స్థలాన్ని కాపాడాలని కోరుతూ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు డాక్టర్ మునవర్ సిరాజ్ వెల్లడించారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె పోలీసులను కోరారు.



# మహిళ అదృశ్యం

**నిజామాబాద్ కోటగిరి / పోతంగల్ ఏప్రిల్ 4 (డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా కోటగిరి గ్రామానికి చెందిన దున్నె సుజాత భర్త లేట్ సత్తిబాబు, వయస్సు: 66 సం లు అనే ఆమె తేదీ 03.04.2026 రాత్రి 10:00 గంటల నుండి 04.04.2026 తెల్లవారుజామున 04:00 గంటల మధ్య కాలంలో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుండి బయటకు వెళ్లారని , తిరిగి రాకపోవడంతో ఆమె కొడుకు దున్నె ప్రవీణ్ కోటగిరి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఫిర్యాదును స్వీకరించిన స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



# వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి

**నిజామాబాద్ కోటగిరి / పోతంగల్ ఏప్రిల్ 04 (డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా కోటగిరి గ్రామానికి చెందిన మృతుడు మస్కల లింగయ్య అలియాస్ భాస్కర్, తండ్రి: కిష్టబోయ్, వయస్సు: 32 ఏళ్లు, కులం: గుండ్ల, అనే వ్యక్తి తేదీ 02.04.2026 సాయంత్రం వేళలో పని నిమిత్తం సులేమాన్ ఫారం వెళ్తుండగా మార్గమద్యంలో ఫకీరుల్లా దాయిమ్ వ్యవసాయ భూమి దగ్గరకు చేరుకోగానే తన యొక్క టీవీఎస్ ఎక్సల్ నెంబర్: ఏపీ 25ఏబీ 1205 అదుపు తప్పి రోడ్డు కింద పడిపోవడంతో అతనికి ముక్కు, తలకు గాయాలు అయ్యి చనిపోయాడని అతని బార్య మస్కల సంధ్యారాణి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఫిర్యాదును స్వీకరించిన స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# మానవత్వమే మిన్న.. వికలాంగులకు అండగా టీజీ ఎస్పీఎఫ్

- **బన్సీలాల్‌పేటలో ఘనంగా అన్నదాన కార్యక్రమం**

**సికింద్రాబాద్,ఏప్రిల్ 04 ( డీడీ9 వార్త):**

కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడంలోనే అసలైన తృప్తి ఉందని, సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలంగాణ రాష్ట్ర స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (టీజీ ఎస్పీఎఫ్) కమాండెంట్ త్రినాథ్ పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వ 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 2026'లో భాగంగా, టీజీ ఎస్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ స్వాతి లక్రా ఆదేశాల మేరకు శనివారం సికింద్రాబాద్‌లోని బన్సీలాల్‌పేటలో ప్రత్యేక సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇక్కడి ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న సుమారు 450 మందికి పైగా మానసిక మరియు శారీరక వికలాంగులకు టీజీ ఎస్పీఎఫ్ విభాగం ఆధ్వర్యంలో నాణ్యమైన భోజనాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమాండెంట్ త్రినాథ్ మాట్లాడుతూ ...కీలక వ్యాఖ్యలు చేశారు. సమాజంలో శారీరక దృఢత్వంతో అన్ని అవయవాలు సక్రమంగా ఉన్నవారిని పట్టించుకునేవారు చాలామంది ఉంటారని, కానీ ఏ ఆధారం లేని అనాథలను, వికలాంగులను ఆదుకోవడానికి ముందుకు వచ్చేవారు తక్కువని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఆశ్రమాల్లో ఉన్నవారికి ఒక్క పూట భోజనం పెట్టడం వల్ల కలిగే సంతృప్తి అమూల్యమైనదని, సాటి మనుషుల పట్ల ఇలాంటి సేవా దృక్పథం కలిగి ఉండటం ఎంతో గొప్ప విషయమని ఆయన కొనియాడారు. భవిష్యత్తులోనూ పోలీసు విభాగం తరపున ఇలాంటి మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ అన్నదాన కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ సన్యాసిరావు, సూపరింటెండెంట్లు కురుమయ్య,విజయ ప్రభలతో పాటు ఎస్సైలు, ఏఎస్సైలు, ఇతర సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పోలీస్ అధికారులు స్వయంగా దగ్గరుండి భోజనాలు వడ్డించడంతో పాటు, ఆశ్రమవాసులతో ఆప్యాయంగా మాట్లాడి వారిలో ధైర్యాన్ని నింపారు. అధికారుల చొరవ పట్ల ఆశ్రమ నిర్వాహకులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు




## అమ్దాపూర్‌లో హిందూ సమ్మేళనం
# కరపత్రాల ఆవిష్కరణ

**బోధన్, నిజామాబాద్ జిల్లా 04ఏప్రిల్ (డీడీ9 వార్త) :**

బోధన్ మండలంలోని అమ్దాపూర్ గ్రామంలో ఈ నెల 8వ తేదీన నిర్వహించ తలపెట్టిన హిందూ సమ్మేళనం కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్త శ్రీశ్రీశ్రీ బాలయోగి పిట్ల కృష్ణ మహారాజ్ ని కలిసిన నిర్వాహకులు, కార్యక్రమ మొదటి కరపత్రాన్ని ఆయనకు అందజేసి ఆశీస్సులు తీసుకున్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు గ్రామ శివారులోని రైతు వేదిక పక్కన ఈ భారీ హిందూ సమ్మేళనం జరగనుంది. ధర్మ ప్రచారం, ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని తలపెట్టినట్లు నిర్వాహక బృందం తెలిపింది. సమ్మేళనానికి అమ్దాపూర్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు, హిందూ బంధువులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, ఆధ్యాత్మిక వేత్తలు మరియు నిర్వాహక సభ్యులు పాల్గొన్నారు



# కెసిఆర్ క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించిన డిసిసి అధ్యక్షులు అంక్షారెడ్డి

- **సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాన్ని బిగించిన కాంగ్రెస్ శ్రేణులు**
- **కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేయాలని డిమాండ్**
- **కెసిఆర్ స్పందించకుంటే ఎర్రవల్లి ఫామ్ హౌజ్ ముట్టడిస్తాం**

**గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి, డీడీ9 వార్త :**

గజ్వేల్ ప్రజలకు కెసిఆర్ అందుబాటులోకి రావాలని డిమాండ్ చేస్తూ ఆయన కెసిఆర్ క్యాంపు కార్యాలయాన్ని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు అంక్షారెడ్డి ఆధ్వర్యంలో శనివారం పార్టీ శ్రేణులు ముట్టడించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాన్ని బిగించి బిఆర్ఎస్ పార్టీ, కెసిఆర్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గజ్వేల్ ఎమ్మెల్యేగా పనిచేస్తున్న కేసీఆర్ ఇప్పటికే రూ కోటి 20 లక్షల వేతనం, ఇతర అలవెన్సులు పొందినట్లు అంక్షారెడ్డి ఆరోపించారు. గజ్వేల్ ప్రజల సొమ్మును అప్పనంగా మేస్తున్న ఆయనను వెంటనే ఎమ్మెల్యే పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. గజ్వేల్ ప్రజలకు అందుబాటులో ఉండని కెసిఆర్ ఒక్క క్షణం కూడా ఎమ్మెల్యేగా కొనసాగే నైతిక హక్కు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా కేసీఆర్ అందుబాటులో ఉండకపోవడంతో కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులు పంపిణీ నిలిచినట్లు స్పష్టం చేశారు. ఇప్పటికైనా ఆయన స్పందించకుంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎర్రవల్లి ఫామ్ హౌజ్ ముట్టడిస్తామని హెచ్చరించారు. ఇక్కడి సమస్యల పరిష్కారంలో కేసీఆర్ ఘోరంగా వైఫల్యం చెందగా, గజ్వేల్ ప్రజలు, ముంపు బాధితులను నట్టేట ముంచినట్లు ఎద్దేవా చేశారు. దమ్ముంటే కేసీఆర్ నిర్వాసిత గ్రామాల్లో పర్యటించాలని డిమాండ్ చేశారు. కెసిఆర్ గజ్వేల్ ప్రజలను గాలికి వదిలినా, పట్టించుకోకున్నా, సీఎం రేవంత్ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం అడిగినన్ని నిధులు ఇస్తున్నట్లు తెలిపారు. ఇక్కడి ప్రజలను నమ్మించి గొంతు కోసిన కేసీఆర్ ను ఎమ్మెల్యే పదవి నుండి తొలగించాలని ఇప్పటికే గవర్నర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు గుర్తు చేశారు. కెసిఆర్ క్యాంపు కార్యాలయం అన్నింటికీ అడ్డాగా మరిందని, ఆయన మాత్రం ఇక్కడ అడుగు పెట్టిన దాఖలాలు లేవని విమర్శించారు. వెంటనే కెసిఆర్ క్యాంపు కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేయాల్సి ఉంటుందని ఆమె హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి నేతృత్వంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు పేదలకు చేరుతుండడంతో జీర్ణించుకోలేక బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు అడ్డు తగులుతున్నట్లు వివరించారు. కాగా మొదటగా గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుండి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున కెసిఆర్ క్యాంపు కార్యాలయం వద్దకు ర్యాలీ నిర్వహించి సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాన్ని బిగించడంతోపాటు ధర్నా, నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్లు నరేందర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్లు సర్దార్ ఖాన్, ప్రభాకర్ గుప్త, మండల పార్టీ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, సుఖేందర్ రెడ్డి, కనకయ్య గౌడ్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు అశోక్ రెడ్డి, వెంకటేష్, జిల్లా మైనార్టీ సెల్ నేత సమీర్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, కౌన్సిలర్లు, నేతలు సత్యలక్ష్మి యాదగిరి, సంతోష రాములు గౌడ్, నరసింహారెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, గుంటుకు లక్ష్మి శ్రీనివాస్, సారిక శ్రీనివాస్ రెడ్డి, జంగం రమేష్ గౌడ్, కరుణాకర్ రెడ్డి, అస్గర్, అజహర్ తదితరులు పాల్గొన్నారు.



## సన్నీ లియోన్ హాలీవుడ్ ఎంట్రీ..



గ్లోబల్ స్టార్‌గా ఎదిగే క్రమంలో నటి సన్నీ లియోన్ ఒక అరుదైన అవకాశాన్ని దక్కించుకున్నారు. 'ది జెయింట్' పేరుతో రూపొందుతున్న ఒక భారీ అమెరికన్ వెబ్ సిరీస్‌లో ఆమె నటించబోతున్నారు. ఈ ప్రాజెక్ట్ తన కెరీర్‌లోనే అత్యంత విభిన్నమైనదని, కొత్త వాతావరణంలో సరికొత్త పాత్రను అన్వేషించడం తనకు ఎంతో థ్రిల్లింగ్‌గా ఉందని సన్నీ సంతోషం వ్యక్తం చేశారు.


ఇక ఈ సిరీస్ విశేషాలు గురించి మాట్లాడుకుంటే.. ఈ సిరీస్ మొత్తం 6 ఎపిసోడ్లుగా రానుంది. ప్రతి ఎపిసోడ్ సుమారు అరగంట నిడివి (30 నిమిషాలు) ఉంటుంది, ఇది పూర్తిగా 'క్యారెక్టర్ డ్రివెన్' (పాత్రల చుట్టూ తిరిగే కథ) శైలిలో ఉండబోతోంది. హాలీవుడ్ నటుడు కెవిన్ బి ప్లాత్ టైటిల్ రోల్ పోషిస్తుండగా.. లాటిన్ అమెరికన్, ఆఫ్రికన్, ఆసియా మూలాలున్న నటీనటులు ఇందులో భాగం కానున్నారు. గతంలో అనురాగ్ కశ్యప్ దర్శకత్వంలో వచ్చిన 'కెన్నెడీ' చిత్రంతో అంతర్జాతీయ వేదికలపై ప్రశంసలు అందుకున్న సన్నీ, ఇప్పుడు ఈ అమెరికన్ సిరీస్‌తో తన మార్కెట్‌ను మరింత విస్తరించుకోనున్నారు. ప్రస్తుతం ఆమె చేతిలో తెలుగు ప్రాజెక్ట్ 'త్రిముఖ'తో పాటు 'రంగీలా', 'షీరో', 'హెలెన్' వంటి ఆసక్తికరమైన చిత్రాలు ఉన్నాయి. షూటింగ్ పూర్తి చేసుకున్న తర్వాత ఈ సిరీస్ ప్రముఖ అంతర్జాతీయ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లలో విడుదల కానుంది.


## నా సినిమాలతో అందరూ బాగుపడ్డారు..



వరుస విజయాలతో బాక్సాఫీస్ వద్ద తనకంటూ ఒక ప్రత్యేక బ్రాండ్‌ను క్రియేట్ చేసుకున్న హీరో అడివి శేష్. తన తదుపరి చిత్రం 'డెకాయిట్' తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. మృణాల్ ఠాకూర్‌తో ఆయన కెమిస్ట్రీ ఈ సినిమాకు మెయిన్ హైలైట్ కానుంది. ఈ చిత్రంతో ఏప్రిల్ 10న విడుదల కాబోతున్న తరుణంలో శేష్ వరుస ప్రమోషన్స్ లో పాల్గొంటున్నారు. ఇందులో భాగంగా ఓ ఇంటర్వ్యూలో తన సినీ ప్రయాణంలోని కీలక విషయాలను పంచుకున్నారు. ముఖ్యంగా తన సినిమాలను నమ్మి పెట్టుబడి పెట్టిన నిర్మాతలకు ఇప్పటివరకు నష్టాలు రాలేదని ఆయన గర్వంగా చెప్పుకొచ్చారు.'ఇప్పటివరకు నాతో పని చేసిన ప్రొడ్యూసర్స్ అందరూ లాభాలు గడించారు. వాళ్ళు పెట్టిన ప్రతి రూపాయికి న్యాయం జరిగిందని నేను నమ్ముతున్నాను' అని శేష్ పేర్కొన్నారు. కేవలం నటుడిగానే కాకుండా, స్క్రిప్ట్ విషయంలో కూడా శేష్ తీసుకునే జాగ్రత్తలే ఆయన సినిమాల మినిమమ్ గ్యారెంటీ సక్సెస్‌కు కారణమని ఇండస్ట్రీ టాక్. అలాగే తన కెరీర్‌లో మర్చిపోలేని సినిమా గురించి ప్రస్తావిస్తూ.. "గూఢచారి నా జీవితాన్ని పూర్తిగా మార్చేసింది. ఆ సినిమా ఇచ్చిన సక్సెస్ వల్లే ఈరోజు నేను ఇలాంటి భారీ ప్రాజెక్టులు చేయగలుగుతున్నాను' అని ఎమోషనల్ అయ్యారు. ఆ సినిమాతో వచ్చిన గుర్తింపు శేష్‌ను కేవలం తెలుగులోనే కాకుండా పాన్ ఇండియా స్థాయిలో ఒక నమ్మకమైన హీరోగా నిలబెట్టింది.

## క్లైమాక్స్‌కు చేరువలో 'వారణాసి'..హైదరాబాద్ శివార్లలో షూటింగ్





దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబినేషన్లో రూపొందుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి' షూటింగ్ శరవేగంగా దూసుకుపోతోంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ఒక అత్యంత కీలకమైన షెడ్యూల్ హైదరాబాద్ సమీపంలోని శంకర్ పల్లిలో జరుగుతోంది. శంకర్ పల్లిలో వేసిన ప్రత్యేక సెట్లో మహేష్ బాబుతో పాటు మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ కూడా పాల్గొంటున్నారు. అయితే అందరినీ ఆశ్చర్యపరిచే విషయం ఏంటంటే, ఈ షూటింగ్‌లో గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా కూడా జాయిన్ అయ్యారు. వీరి ముగ్గురి కాంబినేషన్లో వచ్చే కీలక సన్నివేశాలను రాజమౌళి అత్యంత జాగ్రత్తగా చిత్రీకరిస్తున్నారు. సినిమా కథలో ఈ ఎపిసోడ్ చాలా కీలకం కానుందని సమాచారం.

తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే 80 శాతం పూర్తయింది. శంకర్ పల్లి షెడ్యూల్ ముగిసిన వెంటనే చిత్ర యూనిట్ ఒక చిన్న విరామం తీసుకోనుంది. మహేష్ బాబు షూటింగ్‌కు బ్రేక్ ఇచ్చి తన ఫ్యామిలీతో కలిసి విదేశాలకు వెళ్లనున్నారు. రాజమౌళి జక్కన్న కూడా తన కుటుంబంతో కలిసి ఒక రిఫ్రెషింగ్ ట్రిప్ ప్లాన్ చేశారు. ఈ చిన్న విరామం తర్వాత చిత్ర బృందం తిరిగి వచ్చి మిగిలిన 20 శాతం షూటింగ్‌ను పూర్తి చేయనుంది. షూటింగ్ చివరి దశకు చేరుకోవడంతో అటు మహేష్ అభిమానులు, ఇటు సినీ ప్రేక్షకులు ఈ అడ్వెంచరస్ థ్రిల్లర్ కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

## 'రామాయణ్' రన్‌టైమ్ లీక్ చేసిన రణ్‌బీర్..



దర్శకుడు నితీష్ తివారీ రూపొందిస్తున్న 'రామాయణ్' చిత్రంపై అంచనాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఇటీవల విడుదలైన 'రామ గ్లింప్స్' నెట్టింట రికార్డులు సృష్టిస్తుండగా, తాజాగా ఈ సినిమా నిడివి గురించి ఒక ఆసక్తికరమైన వార్త బయటకు వచ్చింది. అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో హాలీవుడ్ మీడియాతో మాట్లాడుతున్న సమయంలో రణ్‌బీర్ కపూర్ ఈ సినిమా రన్‌టైమ్ గురించి లీక్ చేసేశారు.

ఈ సినిమా విశేషాలను పంచుకుంటూ.. 'రామాయణం అనేది ఒక మహా కావ్యం. దీనిని ఏమాత్రం కుదించకుండా, ప్రతి కీలక ఘట్టాన్ని అద్భుతంగా ఆవిష్కరించేందుకు దాదాపు 6 గంటల ఎపిక్ విజువల్స్‌తో ఈ సినిమా రాబోతోంది' అని రణ్‌బీర్ పేర్కొన్నారు. అయితే ఈ 6 గంటల నిడివి అనేది ఒకే భాగానికి సంబంధించిందా లేక రెండు భాగాల మొత్తం సమయమా అనే దానిపై ఇంకా క్లారిటీ రావాల్సి ఉంది. ఒకవేళ ఒక్కో భాగం 3 గంటల చొప్పున ఉన్నా, అది ప్రేక్షకులకు ఒక గొప్ప విజువల్ ట్రీట్ అవుతుందని చెప్పడంలో సందేహం లేదు. నమిత్ మల్హోత్రా దాదాపు రూ. 4000 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ విజువల్ వండర్ మొదటి భాగం 2026 దీపావళి కానుకగా విడుదల కానుంది. సాయి పల్లవి (సీత), యశ్ (రావణుడు) వంటి స్టార్స్ నటిస్తున్న ఈ సినిమాకు ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండటం విశేషం. ఇంత సుదీర్ఘమైన రన్‌టైమ్‌తో రామాయణాన్ని వెండితెరపై చూపించడం అనేది భారతీయ సినిమా చరిత్రలోనే ఒక సాహసోపేతమైన నిర్ణయమని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

## 'బైకర్'పై నాగార్జున ప్రశంసలు



శర్వానంద్ హీరోగా నటించిన సరికొత్త చిత్రం 'బైకర్'. శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం అంతటా మంచి టాక్‌ను సొంతం చేసుకుంది. ఈనేపథ్యంలో చిత్రబృందాన్ని హీరో నాగార్జున ప్రశంసించారు. సినిమా బాగుందన్నారు. "కుటుంబ అనుబంధాలు, భావోద్వేగాలను అందంగా ఆవిష్కరించిన చిత్రం 'బైకర్'. రేసింగ్ సన్నివేశాలు, క్లైమాక్స్ ఎంతో అద్భుతంగా తీర్చిదిద్దారు. సాంకేతికంగా ఉన్నతంగా ఉంది. మనసుని హత్తుకునే ఇలాంటి కథాంశాన్ని ఇంత పరిణతితో రూపొందించిన దర్శకుడు అభిలాష్ మా అన్నపూర్ణ ఫిల్మ్ కాలేజ్ విద్యార్థి అని తెలిసి గర్వపడుతున్నా. టీమ్ అందరికీ ఇవే నా అభినందనలు" అని నాగార్జున పోస్ట్ పెట్టారు.

నాగార్జున పోస్ట్‌పై దర్శకుడు అభిలాష్ ఆనందం వ్యక్తం చేశాడు. తన సంతోషాన్ని తెలియజేస్తూ పోస్ట్ పెట్టారు. "థాంక్యూ సర్. మీ మాటలు ఎంతో విలువైనవి. అన్నపూర్ణ ఫిల్మ్ అండ్ మీడియా కాలేజీ స్టూడెంట్‌గా మీ నుంచి ఇలాంటి ప్రశంసలు అందుకోవడం ప్రత్యేకంగా ఉంది. మా సినిమాలోని అనుబంధాలు, భావోద్వేగాలు, టెక్నికల్ అంశాలు మీకు నచ్చినందుకు సంతోషంగా ఉంది. నేను మరెన్నో విషయాలు నేర్చుకోవడానికి, అద్భుతమైన కథలను రూపొందించడానికి మీ మాటలు స్ఫూర్తి నింపాయి" అని పేర్కొన్నారు.

భారతీయ తొలి మోటోక్రాస్ రేసింగ్ సినిమాగా 'బైకర్' విడుదలైంది. రేసర్‌గా యువ కథానాయకుడు శర్వానంద్ నటించారు. ఆయనకు జంటగా మాళవిక నాయర్ మెరిశారు. సీనియర్ హీరో రాజశేఖర్ ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించారు.

## 'బ్యాడ్ బాయ్ కార్తీక్' ట్రైలర్ విడుదల డేట్ ఫిక్స్

టాలీవుడ్ యంగ్ టాలెంట్ నాగశౌర్య ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ అవుట్ అండ్ అవుట్ యాక్షన్ ఎంటర్టైనర్ 'బ్యాడ్ బాయ్ కార్తీక్'. ఈ సినిమాతో రామ్ దేశీనా దర్శకుడిగా ఇండస్ట్రీకి పరిచయం అవుతున్నారు. కేవలం మాస్ యాక్షన్ మాత్రమే కాకుండా, ఈ మూవీలో అక్కా తమ్ముళ్ల మధ్య ఉండే బలమైన అనుబంధాన్ని హృదయానికి హత్తుకునేలా చూపించబోతున్నారని సమాచారం. శ్రీనివాస చింతలపూడి నిర్మిస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే టాలీవుడ్‌లో మంచి అంచనాలు ఉన్నాయి. ఈ సినిమా ద్వారా విధి హీరోయిన్‌గా తెలుగు తెరకు పరిచయం అవుతుండగా, సీనియర్ నటి శ్రీదేవి విజయ్ కుమార్ నాగశౌర్య సోదరిగా నటించడం ఈ సినిమాకు ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఇప్పటికే విడుదలైన టీజర్, హరీష్ జయరాజ్ అందించిన పాటలు సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్‌ను దక్కించుకున్నాయి. ప్రమోషన్స్ లో భాగంగా మేకర్స్ ఇప్పుడు అసలైన వేటను మొదలుపెట్టారు. తాజాగా, ఈ సినిమాకు సంబంధించిన పవర్ ఫుల్ ట్రైలర్ రిలీజ్ డేట్‌ను చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఏప్రిల్ 6న 'బ్యాడ్ బాయ్ కార్తీక్' ట్రైలర్‌ను విడుదల చేయబోతున్నట్లు వెల్లడించారు. అంతేకాకుండా మంటలు చెలరేగుతున్నప్పటికీ భయం లేకుండా.. ఫుల్ యాక్షన్ మోడ్‌లో నాగశౌర్య కనిపించాడు. ఈ ట్రైలర్‌తో సినిమాపై ఉన్న అంచనాలను రెట్టింపు చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. యాక్షన్ ప్రియులతో పాటు ఫ్యామిలీ ఆడియన్స్‌ను కూడా ఆకట్టుకునే అంశాలు ఈ ఇందులో పుష్కలంగా ఉన్నాయని తెలుస్తోంది.






## సారా అర్జున్‌నే ఎందుకు ఎంపిక చేశారంటే?

'ధురంధర్ 2' చిత్రం ప్రస్తుతం ఇండస్ట్రీలో సంచలనం సృష్టిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో రణవీర్ సరసన నటించిన సారా అర్జున్ ఎంపిక వెనుక ఉన్న ఆసక్తికరమైన విషయాలను కాస్టింగ్ డైరెక్టర్ ముఖేశ్ ఛాబ్రా తాజాగా ఒక ఇంటర్వ్యూలో పంచుకున్నారు. "ఆదిత్యకు చాలా మంది హీరోయిన్లు మెసేజ్ చేశారు. రణ్‌వీర్‌కు జోడీగా నటించేందుకు వారు ఆసక్తి చూపారు. నాకు కూడా ఎన్నో మెసేజ్‌లు వచ్చాయి. ఈ పాత్ర కోసం కొత్త వాళ్లను ఎంపిక చేసుకోవాలని ఆదిత్యకు చాలా స్పష్టంగా చెప్పాను. వేరే సినిమాల్లో చేసిన ఫేమస్ హీరోయిన్లు అయితే ఈ పాత్రకు సరిపోరు అని సినిమా ప్రకటించినప్పుడే చెప్పాను. రణ్‌వీర్ సింగ్‌తో ఇంతకు ముందు నటించిన హీరోయిన్ అయితే ప్రేక్షకులు కనెక్ట్ కాలేరని తెలిపాను. ఎందుకంటే ఈ సినిమాలో హీరో పాకిస్థాన్‌కు వెళ్లి అక్కడ ఆమెను కలుస్తాడు. కాబట్టి ప్రేక్షకులకు అది ఒక సర్‌ప్రైజ్‌లా ఉండాలని అనుకున్నాం. ఈ పాత్ర కోసం దాదాపు 1300 మందిని ఆడిషన్ చేశాం. చివరకు సారా అర్జున్‌ను ఎంపిక చేశాం" అని ముఖేశ్ తెలిపారు. సారా అర్జున్ గతంలో చైల్డ్ ఆర్టిస్ట్‌గా మెప్పించినప్పటికీ హీరోయిన్‌గా 'ధురంధర్' మొదటి చిత్రం.

## అలుపెరగని పోరాటం

ఆయా షేర్... అంటూ ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులు నాని పాటని పాడుకుంటుంటే, ఆయన మాత్రం పోరాట ఘట్టాలతో బిజీ అయిపోయారు. గత కొన్ని రోజులుగా అలుపెరగ కుండా పోరాట సన్నివేశాల్లో నటిస్తున్నారు. 'ది ప్యారడైజ్' సినిమాకి సంబంధించి నెలకుపైగా సాగనున్న సుదీర్ఘమైన షెడ్యూల్ చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ప్రత్యేకంగా తీర్చిదిద్దిన ఓ సెట్‌లో నాని, ఇతర తారాగణంపై విరామానికి ముందు వచ్చే కీలకమైన పోరాట ఘట్టాల్ని తెరకెక్కిస్తున్నారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా కోసం నాని కండలు తిరిగిన దేహంతో సన్నద్ధమైన సంగతి తెలిసిందే. సికింద్రాబాద్ నేపథ్యంలో సాగే పక్కా మాస్ కథతో రూపొందుతున్న ఈ సినిమాలో జడల్ అనే ఊర మాస్ పాత్రని పోషిస్తున్నారు నాని. పీరియాడిక్ కథతో రూపొందుతున్న ఈ సినిమా కోసం ప్రత్యేకమైన ప్రపంచాన్ని సృష్టించింది చిత్రబృందం. ఎస్.ఎల్.వి సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న చిత్రమిది. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు.

